ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 | సంచిక : 54 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 31 అక్టోబర్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## అజారుద్దీన్ మంత్రి పదవికి బీజేపీ బ్రేకులు.. ఈసీకి ఫిర్యాదు



- మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకునేందుకు సీఎం రేవంత్ యోచన
- ఈ నెల 31న ప్రమాణ స్వీకారం ఉంటుందన్న ఊహాగానాలు
- మంత్రివర్గ విస్తరణను అడ్డుకోవాలని బీజేపీ ప్రయత్నం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన కమలం నేతలు
- విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఈసీకి విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోతున్నట్లు ప్రచారంలో

వివరాలు 2లో..

## సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్



- ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- 2025 నవంబర్ 24న బాధ్యతలు స్వీకరించనున్న కొత్త సీజేఐ
- సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా పదవి చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్
- దాదాపు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్

వివరాలు 2లో..



# ప్రతి ఒక్కరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే

- కలెక్టర్, ఎస్పీ మానిటరింగ్ చేయాలి
- దెబ్బతిన్న రోడ్లను మానిటర్ చేయండి
- అవసరమైతే ట్రాఫిక్ డైవర్ట్ చేయాలి
- ధాన్యం సేకరణకు ప్రాధాన్యం ఇవ్వండి
- ధాన్యాన్ని సమీపంలోని ఫంక్షన్ హాల్స్కు తరలించాలె
- ప్రతి కొనుగోలు కేంద్రానికో స్పెషల్ ఆఫీసర్
- వీడియో కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** మొంథా తుఫాను నేపథ్యంలో అధికారు లు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఫీల్డ్ లో ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికీ మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి బాధ్యతలు అప్పగించాలని సూచించారు.అవ సరమైన చోట ధాన్యాన్ని దగ్గరలోని ఫంక్షన్స్ హాల్స్ కు తరలించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇవాళ జిల్లా కలెక్టర్లలో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ.. దెబ్బతిన్న రోడ్లను మా నిటరింగ్ చేయాలని, అవసరమైన చోట ట్రాఫిక్ డైవర్ట్ చేయాలని సూచించారు. చెరువులు, వాగులు, మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లోలెవల్ కల్వర్టుల దగ్గర పరిస్థితులను గుర్తించి స్థానికులను ముందుగానే అలర్ట్ చేయాలని అన్నారు. కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా పరిస్థితినిఎప్పటికప్పుడు తెలుసుకొని సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై పౌరసరఫ రాల విభాగం ఎప్పటికప్పుడు కలెక్టర్లకు తగిన సూచనలు చేయాలన్నారు. ప్రతీ ధాన్యంకొనుగో లు కేంద్రం నుంచి 24 గంటలకు ఒక సారి పరి స్థితిపై కలెక్టర్ కు రిపోర్ట్ అందాలని అన్నారు. రిపోర్టు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## నేడు వరంగల్, హుస్నాబాద్లో సీఎం ఏరియల్ సర్వే

**హైదరాబాద్ పెన్ పవర్:** నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరంగల్ పర్యటన వాయిదా వేసుకున్నా నని అన్నారు. తుఫాను ప్రభావిత జిల్లా ఇంచార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని మంత్రు లకు సూచించారు. ప్రజలను ఆదుకునేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అన్ని ప్రణాళికలనూ సిద్ధం చేశామని చెప్పారు.




## నేడు రాజ్ భవన్‌లో మంత్రిగా అజారుద్ధీన్ ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్ర కేబినెట్ లో మరో మంత్రి చేరబోతున్నారు. శుక్రవారం (అక్టోబర్ 31) మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాలకు అజారుద్ధీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్ భవన్ లో ఆయన చేత గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అజారుద్ధీన్ కు మంత్రి పదవి ఇవ్వనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. మంత్రి వర్గంలోకి తీసుకోనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మొదలైన నేతలు ఇప్పటికే నిర్ధారించారు. తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ పచ్చజెండా ఊపడంతో శుక్రవారం

వివరాలు 2లో..

## సర్దార్ పటేల్‌కు భారతరత్న ఇవ్వడానికి 41 ఏళ్లు పట్టింది

### కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

- సర్దార్ పటేల్ వారసత్వాన్ని కాంగ్రెస్ గౌరవించలేదని అమిత్ షా ఆరోపణ
- ఆయన మరణించాక భారతరత్న ఇవ్వడానికి కాంగ్రెస్ కు 41 ఏళ్లు పట్టిందని విమర్శ
- మోదీ ప్రధాని అయ్యాకే పటేల్‌కు సముచిత గౌరవం దక్కిందన్న హోంమంత్రి
- పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా భారీ కార్యక్రమాలకు పిలుపు
- ప్రతి ఏటా అక్టోబర్ 31న భారీ పరేడ్ నిర్వహిస్తామని ప్రకటన

వివరాలు 2లో..





## భారత్‌లో పెళ్లిళ్ల సీజన్..

### 45 రోజుల్లో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం!

- నవంబర్ 1 నుంచి 45 రోజుల పెళ్లిళ్ల సీజన్
- దేశవ్యాప్తంగా 46 లక్షల వివాహాలతో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం అంచనా
- వెడ్డింగ్ కొనుగోళ్లలో 70 శాతానికి పైగా స్వదేశీ ఉత్పత్తులకే మొగ్గు
- ఈ సీజన్‌లో కోటికి పైగా తాత్కాలిక ఉద్యోగాలు లభించే అవకాశం
- ఒక్క ఢిల్లీ నుంచే రూ.1.8 లక్షల కోట్ల వ్యాపారం అంచనా
- ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.75,000 కోట్ల ఆదాయం అంచనా

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో పెళ్లిళ్ల సీజన్ మరోసారి ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతాన్ని ఇవ్వనుంది. నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే 45 రోజుల వివాహ సీజన్‌లో దేశవ్యాప్తంగా సుమారు 46 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయని, దీని ద్వారా ఏకంగా రూ. 6.5 లక్షల కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ కాంగ్రెస్ ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తోంది



**హైదరాబాద్ పెన్ పవర్:**గురువారం ( అక్టోబర్ 30 ) జూబ్లీహిల్స్ పరిధిలోని షేక్ పేట్ డివిజన్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్. రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని కేటీఆర్ అంటున్నారని.. పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారో కేటీఆర్ చెప్పాలని అన్నారు మంత్రి వివేక్.

వివరాలు 2లో..

## జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలవుతాయి



- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ట్విట్టర్ దాడి
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపు
- ఉపఎన్నికల కోసమే కాంగ్రెస్ ఆపదమొక్కులు మొక్కుతోందని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారానే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్లు చేశారు.

వివరాలు 2లో..

## మున్నేరు ఉగ్రరూపం.. నిలిచిన వాహనాల రాకపోకలు..

- పెనుగంచిప్రోలు వద్ద కాజ్ వే పైనుంచి ప్రవహిస్తున్న నది
- నీట మునిగిన బ్రిడ్జి.. వాహనాలను ఆపేసిన అధికారులు
- పెనుగంచిప్రోలు గ్రామ వాసులను అప్రమత్తం చేసిన రెవెన్యూ సిబ్బంది



**హైదరాబాద్ పెన్ పవర్:**భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో మున్నే రు నది ఉగ్రరూపం దాల్చింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదనీరు బ్రిడ్జిని ముంచెత్తింది. బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తుండడంతో పోలీసులు, రెవెన్యూ అధికా రులు అప్రమత్తమయ్యారు. వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ వెనుక బీజేపీ...!

### అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేయకుండా అడ్డుకుంటోంది.. !



**హైదరాబాద్ పెన్ పవర్:**బీజేపీ నాయకులు వ్యతిరేకిస్తూ ఎన్ని కల కమిషన్ కు కంప్లయింట్ చేశారని ఆరోపించారు. రాజస్థాన్ లో ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రిని చేశారని అన్నారు. శ్రీ గంగానగర్ జిల్లా శ్రీకర ణ్ పూర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సురేంద్ర పాల్ సింగ్ ను పోలింగ్ కు 20 రోజుల ముందు మంత్రి వర్గం లోకి తీసుకున్నారని గుర్తు చేశారు. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థిని మంత్రి వర్గంలోకి

వివరాలు 2లో..

## బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..

### నిన్న మోదీ ప్రచారం, మొన్న రాహుల్ విమర్శలు

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ
- ముజఫర్‌పూర్, ఛప్రాలో రెండు బహిరంగ సభలు
- ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని ధీమా
- ఓట్ల కోసం మోదీ ఏ డ్రామా అయినా ఆడతారన్న రాహుల్ గాంధీ
- మహారాష్ట్ర, హర్యానా లాగే బీహార్‌లో ఓట్లు దొంగిలిస్తారని ఆరోపణ
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పోలింగ్

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

### ఎంత కష్టం.. ... ఎంత నష్టం...

# రైతు కంట కన్నీరు...

ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండానే నాశనమయిపోయింది. 243 మండలాల్లో తీవ్ర పంటన నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంట నేలవాలింది. అరటి, బత్తాయి వంటి తోటలు పూర్తిగా ఈదురుగాలులలకు ధ్వంసమయ్యాయి. మిరప, పత్తి రైతులు నష్టపోయి కూడా ఆందోళన చెందుతున్నారు. కంది, అరటి, బొప్పాయి, వేరుశెనగ వంటి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. 22 రెండు జిల్లాల్లో మొంథా తుపానుతో భారీగా పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతి వరకూ అన్ని జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు... వరి సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. భారీ వర్షాలకు, ఈదురుగాలులలకు వరిపంట దెబ్బతినింది. డెల్టా ప్రాంతంలో సాగవుతున్న వరి నేలకొరిగింది. వరి ప్రస్తుతం కంకుల దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తున్న దశలో భారీ వర్షం, గాలులకు పంట దెబ్బతినింది. మరో పదిహేను రోజుల్లో పంట చేతికి వస్తుందనుకుంటున్న దశలో నష్టం వాటిల్లినట్లు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంటపై ఆశలు వదులుకోనున్నారు. వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు ఇక కోలుకోలేని పరిస్థితి నెలకొంది. పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. పెట్టుబడి వచ్చే అవకాశం కూడా కనిపించడం లేదు. . వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో పంట పూర్తిగా నాశనయినట్లేనని అన్నదాతలు విలపిస్తున్నారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఈదురుగాలులు కూడా బలంగా వీస్తాయని, గంటకు అరవై నుంచి డెబ్బయి కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నందును ఎవరూ వీలయినంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు కోరుతున్నారు. వాగులు, నదులు దాటే ప్రయత్నం ఎవరూ చేయవద్దని, అలాగే ప్రయాణాలు కూడా వీలయినంత మేరకు మానుకోవాలని సూచించింది. ఈదురుగాలులు వీస్తూ... మొంథా తుపాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు పడుతున్నాయి. గాలుల తీవ్రత కూడా పెరిగింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. తుపాన్ ప్రభావంతో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. తీర ప్రాంతాల్లో పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. తుపాన్‌గా బలహీనపడుతున్న మొంథా రానున్న ఆరు గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాకఖ తెలపింది. ఆంధ్రప్రదేశ్ లోని 12 జిల్లాలకు భారీ వర్ష సూచన చేింది. తొమ్మిది జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచనచేసిదరి. 9శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఎకరాకు ముప్ఫయి నుంచి నలభై వేల రూపాయలు నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, కంది, బొప్పాయి, బత్తాయి వంటి పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో అన్నదాతలు కోలుకోవడం కష్టమేనని అనిపిస్తుంది. ప్రభుత్వం పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించింది. అయినా ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం వీరి నష్టాన్ని ఏమాత్రం పూడ్చలేదన్నది మాత్రం వాస్తవం.

## సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్. గవాయ్ సిఫార్సు మేరకు ఈ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 నవంబర్ 24వ తేదీ నుంచి జస్టిస్ సూర్యకాంత్ నియామకం అమల్లోకి వస్తుందని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది.

ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ 2025 నవంబర్ 23న 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిని తదుపరి సీజేఐగా నియమించే సంప్రదాయం ప్రకారం, జస్టిస్ గవాయ్ తన తర్వాత జస్టిస్ సూర్యకాంత్ పేరును సిఫార్సు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (2) ప్రకారం రాష్ట్రపతి ఈ నియామకాన్ని ఆమోదించినట్టు కేంద్ర న్యాయ శాఖ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. జస్టిస్ సూర్యకాంత్ భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారు. ఆయన దాదాపు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగి, 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేస్తారు.

**జస్టిస్ సూర్యకాంత్ నేపథ్యం**

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుంచి 1984లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, మరుసటి ఏడాది చండీగఢ్‌కు మారి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆయన అతి పిన్న వయసులోనే 2000 జులై 7న హర్యానా అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడి నుంచి 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జాతీయ న్యాయ సేవల అథారిటీ లో సభ్యుడిగా సేవలందించిన ఆయన, ప్రస్తుతం సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

# అజారుద్దీన్ మంత్రి పదవికి బీజేపీ బ్రేకులు.. ఈసీకి ఫిర్యాదు

- మొదటి పేజి తరువాయి

ఉన్న మంత్రివర్గ విస్తరణకు బ్రేకులు వేసేందుకు బీజేపీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ మేరకు బీజేపీ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డిని కలిసి, విస్తరణకు అనుమతి ఇవ్వవద్దని కోరారు. వివరాల్లోకి వెళితే, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నిర్ణయించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నెల 31వ తేదీన అజారుద్దీన్‌తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బీజేపీ నేతలు అప్రమత్తమయ్యారు. బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి శంకర్ తదితరులు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయవద్దని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ అభ్యంతరాలను తెలియజేశారు.

## నేడు రాజ్ భవన్‌లో మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం

- మొదటి పేజి తరువాయి

(అక్టోబర్ 31) అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అజారుద్దీన్‌కి హోం లేదా మైనారిటీ మంత్రిత్వ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా నామినేట్ చేసి ఆయనను మంత్రి వర్గంలోకి తీసుకోనున్నారు. అయితే అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఇప్పుడు మంత్రి పదవి ఇవ్వటమేంటని ఫిర్యాదులో పేర్కొంది.

మైనారిటీ వర్గాలకు మంత్రి పదవి ఇస్తామంటే బీజేపీకి అభ్యంతరమెందుకని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. అజారుద్దీన్ హైదరాబాద్ వ్యక్తి .. మంచి క్రికెటర్.. ఇండియా టీమ్ కు ప్రాతినిథ్యం వహించారు.. దేశానికి సేవ చేశారు.. అలాంటి వ్యక్తికి మంత్రి పదవి ఇస్తుంటే అడ్డుకోవాలని చూస్తోందని విమర్శించారు.

# జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలవుతాయి

- మొదటి పేజి తరువాయి

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చిత్తుగా ఓడించాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అలాంటి ఓటమి రుచి చూస్తేనే అధికార పార్టీకి భయం పట్టుకుంటుందని, అప్పుడే పెండింగ్‌లో ఉన్న హామీల అమలుపై దృష్టి పెడుతుందని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయి వాస్తవాలు అర్థమవుతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 'ఆపదమొక్కులు' మొక్కుతోందని కేటీఆర్ విమర్శించారు. పార్టీ పరువు కాపాడుకోవడం కోసమే రకరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సినీ కార్మికులకు కొత్త వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోనుండడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేనంత హడావుడిగా హైదరాబాద్ వీధుల్లో తిరగడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని కేటీఆర్ తెలిపారు.

ఈ ఉపఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబితేనే, రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బీఆర్ఎస్ వెనుక బీజేపీ...!

### అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేయకుండా అడ్డుకుంటోంది.. !

- మొదటి పేజి తరువాయి

తీసుకుంటే తప్పు లేనిది. అజారుద్దీన్ ను కేబినెట్ లోకి తీసుకుంటే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేయకుండా గవర్నర్ పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు.

జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ను గెలిపిం చేందుకు బీజేపీ సర్వశక్తుల ఒడ్డుతోందని అన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణ నిజమేనని స్పష్ట మవుతోందని చెప్పారు. అనైతికంగా అజారుద్దీన్ మంత్రి కాకుండా బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని అన్నారు. బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రజ లకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞుల ని ఒక్క సారి ఈ రెండు పార్టీల చీకటి బాగోతాన్ని గమనించాలని అన్నారు. అజారుద్దీన్, కోదండరాం ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా తీర్మానం చేసి రాజ్ భవన్ కు పంపితే గవర్నర్ పెండింగ్ లో పెట్టారని అన్నారు. కోర్టులో గెలిచి తీరుతామని అన్నారు. అజారుద్దీన్ మంత్రివర్గంలోకి రావడం ఖాయమని, మంత్రిగా మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడతారని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్క మాట్లాడుతూ... లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతు ఇచ్చి 8 స్థానాల్లో గెలిపించిందని ఆరోపిం చారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి బిజేపీ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్టు అర్థ మవుతోందని అన్నారు. ఒక మైనార్టీ వర్గానికి చెందిన అంతర్జాతీయ క్రీ డాకారుడు, భారత జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించిన క్రికెటర్ రాష్ట్ర మంత్రి అవుతుంటే అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు పార్టీలూ కలిసి కుమ్మక్కు డ్రామా నడుపుతున్నాయని ప్రజలు దీనిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీ హిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు వస్తున్న ప్రజాదరణనుచూసి ఓర్వలేకనే రెండు పార్టీలు కలిసి కుట్రలుచేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని మరోమారు రుజువైందని తెలిపారు.

## బీఆర్ఎస్ కాంగ్రెస్ ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ కాంగ్రెస్ ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. పేదల పక్షాన నిలబడే వ్యక్తిని కాబట్టే అధిష్టానం తనను ఇంచార్జిగా నియంనించిందని అన్నారు. షేక్ పేట్ డివిజన్ అభివృద్ధి చెందలేదంటే పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ను ప్రశ్నించాలని అన్నారు మంత్రి వివేక్. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని కేసీఆర్ మోసం చేశారని... పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారో చెప్పాలని అన్నారు. షేక్ పేట్ డివిజన్ లో చాలా సమస్యలు ఉన్నాయని.. పదేళ్లలో బీఆర్ఎస్ పట్టించుకోలేదని మండిపడ్డారు. ముస్లిం మైనారిటీ నుండి గతంలో మహమూద్ అలీ మంత్రిగా పని చేసారని.. ఆయన ముస్లిం సమాజానికి ఏం చేయలేదని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అజారుద్దీన్ ని మంత్రి చేస్తోందని.. ఎమ్మెల్సీగా ముస్లిం మైనారిటీ వ్యక్తికి అవకాశం ఇస్తే బీఆర్ఎస్ అడ్డుకున్నారని అన్నారు మంత్రి వివేక్. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని.. బీఆర్ఎస్ కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్లేనని అన్నారు. ఇంకా మూడేళ్ళ పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని.. కాంగ్రెస్ వల్లే ఇక్కడ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని బీఆర్ఎస్ గతంలో హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు మంత్రి వివేక్. 28 రాష్ట్రాల్లో దొడ్డు బియ్యం ఇస్తున్నారని.. సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ, కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు మంత్రి వివేక్.

## సర్దార్ పటేల్‌కు భారతరత్న ఇవ్వడానికి 41 ఏళ్లు పట్టింది

భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వారసత్వాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విమర్శించారు. పటేల్ మరణించిన 41 సంవత్సరాల తర్వాత ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. సర్దార్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "సర్దార్ పటేల్ మరణానంతరం ఆయన వారసత్వాన్ని చెరిపివేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఆయనకు భారతరత్న ఇవ్వడానికి 41 ఏళ్ల సమయం పట్టింది. కానీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అతిపెద్దదైన 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' నిర్మించి పటేల్‌కు అసలైన గౌరవాన్ని అందించారు" అని అమిత్ షా అన్నారు. సర్దార్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల గురించి తెలియజేయడానికే తాను ఇక్కడికి వచ్చానని షా తెలిపారు. "భారతదేశ స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఏకీకృతం చేయడంలో, ఏక్ భారత్ నిర్మాణంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారు. రేపు ఆయన 150వ జయంతి. 2014 నుంచి ప్రధాని మోదీ ప్రతి ఏటా కేవడియాకు వచ్చి ఆయనకు నివాళు లు అర్పిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31న ప్రతి సంవత్సరం భారీ పరేడ్ నిర్వహించాలని హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు అమిత్ షా ప్రకటించారు. "ఈ సంవత్సరం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాలు, పోలీస్ స్టేషన్ల స్థాయిలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తాం" అని వివరించారు. దీంతో పాటు నవంబర్ 1 నుంచి 15 వరకు ఏక్తా నగర్‌లో 'ఏక్ భారత్ పర్వ్' కార్యక్రమం ఉంటుందని, గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతినాడు ఐ

అది ముగుస్తుందని తెలిపారు. "సర్దార్ పటేల్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక సిద్ధాంతం. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మహాత్మాగాంధీ నేతృత్వంలోని ఎన్నో ఉద్యమాలకు వెన్నెముకగా నిలిచారు. అందుకే గాంధీజీ ఆయనకు ప్రేమతో 'సర్దార్' అనే బిరుదు ఇచ్చారు" అని అమిత్ షా అన్నారు. దేశ సమగ్రత విషయంలో పటేల్ తీసుకున్న నిర్ణయాత్మక పాత్రను గుర్తుచేస్తూ, "ఆగస్టు 15న దేశమంతా స్వాతంత్ర్య వేడుకల్లో ఉన్నప్పుడు, సర్దార్ పటేల్ కమాండ్ రూమ్‌లో ఉండి లక్షద్వీప్‌ను కాపాడేందుకు నావికాదళ అధికారులతో ఆపరేషన్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే ఆ దీవులు భారత్‌లో అంతర్భాగమయ్యాయి" అని అమిత్ షా వివరించారు.

## భారత్‌లో పెళ్లిళ్ల సీజన్.. 45 రోజుల్లో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం!

- మొదటి పేజి తరువాయి

ఒక నివేదిక అంచనా వేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ పరిశోధన విభాగమైన సీఆర్‌టీడీఎస్ గురువారం ఈ నివేదికను విడుదల చేసింది. దేశంలోని 75 నగరాల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ వివరాలను వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే పెళ్లిళ్ల సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, ఒక్కో వివాహానికి చేసే ఖర్చు గణనీయంగా పెరిగిందని నివేదిక పేర్కొంది. ఒక్క దేశ రాజధాని ఢిల్లీలోనే 4.8 లక్షల వివాహాల ద్వారా రూ.1.8 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేశారు.

గత పండుగ సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన అమ్మకాల తర్వాత వినియోగదారుల్లో పెరిగిన విశ్వాసం, ప్రజల వద్ద పెరిగిన ద్రవ్య లభ్యత, బంగారం వంటి విలువైన లోహాల ధరలు పెరగడం వంటి కారణాలతో ఈసారి వ్యాపారం భారీగా పెరిగిందని %జూ×ు% సెక్రటరీ జనరల్, చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. గతేడాది (2024లో) 48 లక్షల వివాహాల ద్వారా రూ.5.90 లక్షల కోట్ల వ్యాపారం జరగ్గా, 2023లో 38 లక్షల వివాహాలకు రూ.4.74 లక్షల కోట్లు ఖర్చు చేశారు.

**స్వదేశీ ఉత్పత్తులకే పెద్దపీట**

ఈసారి పెళ్లిళ్లలో స్వదేశీ ఉత్పత్తుల వాడకం గణనీయంగా పెరగడం ఒక ముఖ్యమైన పరిణామం. పెళ్లికి సంబంధించిన కొనుగోళ్లలో 70 శాతానికి పైగా దుస్తులు, ఆభరణాలు, అలంకరణ వస్తువులు, పాత్రలు వంటివి భారతీయ తయారీవే ఉంటున్నాయని నివేదిక హైలైట్ చేసింది. %జూ×ు% చేపట్టిన "వోకల్ ఫర్ లోకల్ వెడ్డింగ్స్" ప్రచారం మంచి ఫలితాలనిస్తోందని, దీనివల్ల చైనా లైట్లు, కృత్రిమ అలంకరణ వస్తువుల వంటి దిగుమతులు బాగా తగ్గాయని పేర్కొంది. ఈ వివాహ సీజన్ ద్వారా సుమారు కోటికి పైగా తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు సృష్టించబడతాయని ఖండేల్వాల్ తెలిపారు. డెకరేటర్లు, క్యాటరింగ్ సిబ్బంది, పూల వ్యాపారులు, కళాకారులు, రవాణా, హాస్పిటాలిటీ రంగాల వారికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. అలాగే, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, హస్తకళలు, ప్యాకేజింగ్ వంటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (%మీావీజుం%) ఇది పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఈ సీజన్‌లో ప్రభుత్వానికి పన్నుల రూపంలో సుమారు రూ.75,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. మొత్తం వ్యాపారంలో ఆభరణాల వాటా 15% ఉండగా, దుస్తులు, చీరల వాటా 10%గా ఉంటుందని తెలిపింది.

## బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీల అగ్రనేతల పర్యటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలలో రెండు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రచారాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ బీహార్‌లో బీజేపీ-ఎన్డీఏ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "బీహార్‌లోని నా కుటుంబ సభ్యులే ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం కోసం స్వయంగా బరిలోకి దిగారు. ఈ ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఉదయం 11 గంటలకు ముజఫర్‌పూర్‌లో, మధ్యాహ్నం 12:45 గంటలకు ఛప్రాలో ప్రజలతో సంభాషించే భాగ్యం నాకు కలుగుతుంది. రాష్ట్రంలోని నా సోదర సోదరీమణులు మరోసారి విజయ శంఖాన్ని పూరిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ముజఫర్‌పూర్‌లో జరిగిన మహాఘట్‌బంధన్ ఉమ్మడి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఆయనకు (మోదీకి) కేవలం మీ ఓటు మాత్రమే కావాలి. ఓట్ల కోసం డ్రామా చేయమంటే చేస్తారు. మీరేమైనా చేయించగలరు. నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమన్నా చేస్తారు" అంటూ రాహుల్ విమర్శించారు. "వారు మీ ఓట్లను దొంగిలించే పనిలో ఉన్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలను దొంగిలించారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే ప్రయత్నం చేస్తారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బుధవారం బేగుసరాయ్, సమస్తిపూర్, దర్భంగాలలో ఎన్డీఏ తరఫున ప్రచార ర్యాలీలు నిర్వహించారు. 2025 బీహార్ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య నెలకొంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ (రామ్ విలాస్) వంటి పార్టీలు ఉండగా, మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఉన్నాయి. వీటికి తోడు ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ కూడా రాష్ట్రంలోని 243 స్థానాల్లో పోటీ చేస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## మున్నేరు ఉగ్రరూపం.. నిలిచిన వాహనాల రాకపోకలు..

- మొదటి పేజి తరువాయి

వరద ఉధృతికి పెనుగంచిప్రోలు పరిసర ప్రాంతాల్లో పలు ఆలయాలు నీట మునిగాయి. గత రాత్రి నుండి ఇప్పటివరకు 15 అడుగులకు పైగా వరద నీరు పెరగడంతో పెనుగంచిప్రోలు గ్రామ వాసులను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. లోతట్టు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

# మొంథా తుఫాన్ బాధితులకు అండగా నిలిచిన జనసేన పార్టీ......





గుర్రంపేట గ్రామంలో కూరగాయలు పంపిణీ....

**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 30):** మొంథా తుఫాన్ బాధితులకు నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్,బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్
రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో వర్షాలతో ఇబ్బందులు పడుతున్న నాతవరం మండలం ఏపీ.పురం పంచాయతీ గుర్రంపేట గ్రామంలో తుఫాన్ నేపధ్యంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పలువురు బాధితులకు గురువారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తుఫాన్ నేపధ్యంలో ముందు చూపుతో పకడ్బందీ చర్యలు చేపట్టడంతో తుఫాన్ ముంపు నుండి బయటపడటం జరిగిందన్నారు.గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కష్టాల్లో, ఆపదలో ఉన్న ప్రజలకు జనసేన పార్టీ ఎప్పుడు అండగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో కూడా పలువురు బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ,సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు, నాతవరం మండల ఉపాధ్యక్షులు గుడివాడ అసేన్ కుమార్, వర్రే నరసింహ,రెడ్డి నాయుడు, మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి..!

- పాడేరు జిల్లా ఆరోగ్య కేంద్ర వైద్యుల నిర్లక్ష్యమే ఒక ప్రాణం బలి. అంటున్న కుటుంబ సభ్యులు.
- రాప పంచాయతీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు భీమన్న కన్నుమూత
- జిల్లా ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో లేని చికిత్స పరికరాలు
- అందుబాటులో లేని స్కానింగ్ సిబ్బంది
- సమయానికి స్కానింగ్ రిపోర్ట్ లేకపోవడంతో పూర్తిగా అందని చికిత్స
- వైద్యుల. నిర్లక్ష్యమే నిండు ప్రాణం బలి
- ఆ కుటుంబానికి ప్రభుత్వమే ఆదుకోవాలి



**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 30**
అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం రాప పంచాయతీ కె తాడిపుట్టు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు శతక భీమన్న తండ్రి రామన్న బుధవారం తుపాన్ ప్రభావం పశువుల మేతకు వెళ్లి భారీ వర్షం కారణంగా పడిపోయి తలకు బలంగా దెబ్బ తగిలి పాడేరు ఆసుపత్రి కి తీసుకువెళ్లాడని అంబులెన్స్ లు అందుబాటులో లేకపోవడంతో ఆటో మీద తీసుకు వెళ్లి చికిత్స పొందుతూ పాడేరు గవర్నమెంట్ ఆసుపత్రిలో సరైన చికిత్స అందక. లేక నిండు ప్రాణాలు కోల్పోయిన ఒక కుటుంబం.ఈ మరణం కేవలం వైద్య అధికారుల.నిర్లక్ష్యం మాత్రమే అని వాపోయారు.ఆ కుటుంబానికి ప్రభుత్వమే ఆదుకోవాలనీ గ్రామస్థులు అన్నారు.సమయానికి స్కానింగ్ రిపోర్ట్ లేకపోవడంతో పూర్తిగా చికిత్స అందించలేదని అన్నారు.పాడేరు నుండి కేజీహెచ్ కి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఘాట్ రోడ్డు వద్ద తుది శ్వాస విడిచారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలమకున్నాయి

# మెడికల్ కళాశాలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ.....

- తాండవ జంక్షన్ వద్ద ప్రైవేటీకరణ నష్టాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్......
- హాజరైన నాతవరం మండల వైసీపీ శ్రేణులు....





**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 30):** నర్సీపట్నం లో మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర గణేష్ అన్నారు. గురువారం మండలంలో గల తాండవ జంక్షన్ వద్ద ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో మండల వైసీపీ నాయకుల సమక్షంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల వద్ద నుండి కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ నర్సీపట్నం మెడికల్ కాలేజ్ ను కూటమి ప్రభుత్వం అన్యాయంగా ప్రైవేటీకరణ చేస్తుందని అన్నారు. ఈ ప్రైవేటీకరణ వలన ఈ ప్రాంత ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేయడం తగదని అన్నారు. ప్రైవేటీకరణ చేయడం వల్ల ఈ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలకు ఉచిత వైద్యం పూర్తిగా అందుకుండా చేయడం జరుగుతుందని, అంతేకాకుండా పేద విద్యార్థులకు ఉచిత విద్య కూడా దూరం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.గవర్నర్ కి పంపించే లేకపై తీసుకున్న ఈ సంతకాలను మాజీ ముఖ్యమంత్రి,వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్ కి పంపించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు లగుడు నాగేశ్వరరావు,వైస్ ఎంపీపీ పైల సునీల్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు పైల పోతురాజు,వైసిపి మండల యూత్ అధ్యక్షులు బండారు నాయుడు,వైసీపీ సీనియర్ నాయకులు మంకు సాంబమూర్తి, వైసిపి మహిళా అధ్యక్షురాలు కామిరెడ్డి వెంకటలక్ష్మి ,గునుపూడి సర్పంచ్ వేమల సూర్యనారాయణమూర్తి, గన్నవరం సర్పంచ్ సత్యనారాయణ,యువ నాయకులు గవిరెడ్డి కృష్ణంరాజు,అప్పిరెడ్డి మహేష్, రెడ్డి వరహాలు బాబు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్"ప్రభావంతో గూడెం కొత్తవీధి పంచాయతీ పరిధిలో పంటల పరిశీలన




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 30:**"మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా గూడెం కొత్త వీధి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి, పనసపల్లి, లంకపాకల గ్రామాలలో వరి, సామ, రాగి పంటలకు కొంతమేరా నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ సహాయకుల బృందం గ్రామాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించింది. పరిశీలనలో 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లిన పంటలను గుర్తించి, సంబంధిత వివరాలను నమోదు చేసి నివేదికను సిద్ధం చేశారు. అదేవిధంగా నీటిలో మునిగిన పంట చేలను శుభ్రపరచి, పంటలు పునరుద్ధరించుకునేలా గడ్డి ఉప్పు ద్రావణం (5%) పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు రైతు సేవ కేంద్ర సిబ్బంది మేఘనా, సాగిన కృష్ణ పాల్గొని పంటల పునరుద్ధరణ చర్యలపై అవగాహన కల్పించారు.

# పొంగి ప్రవహిస్తున్న కొండవాగులు...!

**వాహన చోదకు లకు అధికారులు సూచన**

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 30:** మండలంలో కురిసిన భారీ వర్షాలకు కొండ వాగులు పొంగి ప్రవహించడంతో వాహన చొధకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కాకరపాడు సింగవరం వంతెనల పై నుండి కొండ వాగు నీరు ప్రవహించడంతో గురువారం 11 గంటల వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనితో మండల అధికారులు కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ, ఎంపీడీవో జీడివి ప్రసాదరావు పర్యవేక్షించి వాహన చొదకులకు సలహాలు సూచనలు అందించి కొండ వాగు ఉధృతి తగ్గేవరకు వాహన రాకపోకలను నిలుపుదల చేశారు, కొండ వాగు ఉధృతి తగ్గిన అనంతరం యధావిధిగా వాహన రాకపోకలు సాగాయి. దీనితో మండల స్థాయి అధికారుల పనితీరును చూసి ప్రజలు అర్షం వ్యక్తం చేశారు.



# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,అక్టోబర్ 30** వైస్సార్సీపీ 87 వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో పాత వడ్లపూడి యస్. సి. కాలనీ లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. గాజువాక వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ తిప్పలు దేవం రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేశారు. వార్డ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు పాల్గొని ఈ కార్యక్రమానికి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వైసిపి 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపట్టారు ప్రభుత్వ ఉన్న ఐదు సంవత్సరాల్లో 7 కాలేజీలు పూర్తయ్యాయి మిగతా కూడా చివర విడతలో ఉన్నాయని వాటిని కూటమి ప్రభుత్వం 17 కాలేజీలను ప్రైవేటు ప్రైవేటీపరం వాటి వల్ల పేద విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని దానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్ గారికి సమర్పించాలని దాన్లో భాగంగా 87వ వార్డు లో కోటి సంతకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు . కార్యక్రమంలో పాల్గొన్నవారు 87వార్డు వైఎస్ఆర్సిపిఅధ్యక్షుడు బొడ్డ గోవింద్, గాజువాక బీసీ సెల్ అధ్యక్షుడు చిత్రాడ వెంకటరమణ, బొడ్డ. వెంకటసురి, ఆడారి. శ్రీను,గాలి. నూకరాజు, పి. అప్పారావు, యమ్. తవిటయ్యే,పి. అప్పారావు, గాలి. రమణమ్మ,పార్టీ కార్యకర్తలు , అభిమానులు , అధిక సంఖ్య లో మహిళలు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావిత కుటుంబాలను పరామర్శించిన జనసేన నాయకులు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 30:**ముంథా తుఫాను కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీ ఈదులబంధ, తీముల బంధ గ్రామాలలో భారీ వర్షాలు, గాలుల ప్రభావంతో గెమ్మెలి నీలన్న, కొర్ర చిన్నమ్మి, కొర్ర రఘునందన్ నివాసాలకు నష్టం వాటిల్లింది. ఇళ్ల పైకప్పులు శిథిలమై,గోడలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.ఈ విషయాన్ని సోషల్ మీడియాలో గమనించిన జనసేన నాయకులు గొర్లె వీరవెంకట్ ఆధ్వర్యంలో ప్రభావిత కుటుంబాలను స్వయంగా సందర్శించి పరామర్శించారు.బాధితులను ధైర్యం చెప్పి, ప్రభుత్వ సహాయం త్వరలో అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.సమాచారం అందుకున్న స్థానిక అధికార యంత్రాంగం కూడా తక్షణమే స్పందించి, నష్టం వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది. వీరవెంకట్ మాట్లాడుతూ, "ప్రభుత్వం తప్పకుండా స్పందించి మీకు న్యాయం చేస్తుంది" అని బాధితులకు నమ్మకం కలిగించారు.ఇక కొర్ర చిన్నమ్మి కుటుంబం పరిస్థితిని గమనించిన వీరవెంకట్, ఆమెకు కొంత నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ వడేలు పాండురాజు, జనసేన ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్, జనసేన పార్టీ ఉపాధ్యక్షులు అనిల్, తాడి రమేష్, పీసా ఉపాధ్యక్షులు గెమ్మెలి కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు "తోడు" లోకుల గాంధీ ట్రస్ట్ నిత్యవసర సరుకులు పంపిణీ



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 30 :**తుఫాన్ ప్రభావంతో ఇంటిని కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు తోడు ది లోకుల గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మండలంలోని రావణాపల్లి పంచాయతీ రేవడివీధి గ్రామానికి చెందిన మాదల గంగరాజు తాటాకిల్లు మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో నిలువనీడ లేకుండా ఆర్థికంగా నష్టపోయిన కుటుంబ సభ్యులను తోడు ది లోకుల గాంధీ ట్రస్ట్ ప్రతినిధులు, బిజెపి నేతలతో కలిసి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకులను ట్రస్ట్ ప్రతినిధి ఉపాధ్యాయుడు లోకుల కిరణ్ ఆధ్వర్యంలో బిజెపి మండలాధ్యక్షుడు సంపరి శివకుమార్, టిడిపి మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ చంద్రరావు చేతుల మీదుగా 25 కేజీలు బియ్యం, వెయ్యి రూపాయలు కూరగాయలు, కిరాణా మొదలైన నిత్యావసర పంపిణీ చేశారు.

అదేవిధంగా దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులకు దుప్పటి, చీర, పంచె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మచ్చల మంగతల్లి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి డి పద్మరాజు, ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధులు ఎం.శ్రీను, ఎస్.వరలక్ష్మి , వనవాసి కళ్యాణ ఆశ్రమం జిల్లా ప్రతినిధి పొట్టిక జోగిరాజు, వెంకటేశ్వర్లు, అర్చకులు, గ్రామపెద్దలు తదితర పలువురు పాల్గొన్నారు.

# కిస్తీ కట్టలేక... ఆటోల అమ్మకం...

**నిజామాబాద్, అక్టోబరు 30, పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో మహిళలు బస్సులలో ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. మహిళా ప్రయాణికులు లేక ఆటోలు వేలవేల బోతున్నాయి. కేవలం పురుషులు మాత్రమే ఆటోలలో ప్రయాణం చేస్తున్నాడంతో ఆటోవాలాలకు భారీగా గిరాకీ తగ్గింది. గతంలో ఎక్కడ చూసినా ఆటోలల్లో మహిళలు కనిపించేవారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలు ప్రయాణం చేసేందుకు ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల లో ప్రయాణం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆటోవాలా ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. ఫైనాన్సులలో తెచ్చుకున్న వారు ఫైనాన్స్ కిస్తీలు చెల్లించక ఆటోలను అమ్ముకుంటున్నారు. మరికొందరు కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.ప్రభుత్వం ఆటోవాలాలకు నెలసరిగా పింఛన్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అమలు చేయడం లేదు. ఉపాధి దెబ్బ తినడంతో ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. గులాబీ పార్టీ ప్రభుత్వ హాయంలో రుయ్యు.. రుయ్యున తిరిగే ఆటోల స్పీడుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో బ్రేక్ పడింది. దినమంతా కిటకిటలాడే ఆటో స్టాండ్ లలో ప్రయాణికుల జాడే కనిపించకుండా పోయింది.మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తేవడంతో ఆటోవాలాల ఆదాయానికి గండి పడింది. పొద్దంతా అడ్డాలో కూసున్న.. సంపాదన మాత్రం సున్నా గా మారింది. తెలంగాణలో ఆటో రిక్షా కార్మికుల పరిస్థితి ఇలా ఉంటే, ఆంధ్రప్రదేశ్లో మాత్రం అక్కడి ప్రభుత్వం దీపావళి కానుకగా ప్రతి ఆటో రిక్షా కార్మికుడికి 15వేల రూపాయల చొప్పున వారి వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు ప్రకటించడం పై ఇక్కడి ఆటో రిక్షా సంఘాల్లో ఆందోళన మొదలైంది.తమ కూడా ఆంధ్రాలో ఇస్తున్నట్లుగా తెలంగాణ ఆటో రిక్షా కార్మికులకు దీపావళి కానుక అందించాలంటూ వారి నుండి డిమాండ్ తెరపైకి వస్తుంది. కాగా, గతంలో ఆటోలు మహిళలతోనే నిండుగా కనిపించేవి. ప్రస్తుతం మహిళా ప్రయాణికులు అందరూ ఆధార్ కార్డుతో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తుండడం వల్ల ఆటోలలో మహిళల సందడి లేకుండా ఉంది. నిజానికి పల్లె నుండి పట్టణానికి రావాలన్న, పట్టణవాసులు మార్కెట్లో ఏదైనా ఖరీదు చేయాలన్న ఆటోలను మహిళల ఆశ్రయించే పరిస్థితి ఉండేది.దీంతో ఆటోవాలాలు రోజుకు 1000 నుండి 1500 రూపాయల వరకు సంపాదించుకునేవారు. ఆర్టీసీ బస్టాండ్ ల ముందు ఆటో అడ్డాలు ఉండటం వల్ల ప్రయాణికులు దూర ప్రాంతాల నుండి వచ్చిన, సమీపంలో ఉన్న పల్లెలకు వెళ్లాలన్న ఆటోలోనే ప్రయాణం చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులను మాత్రమే ఆశ్రయిస్తున్నారు. చివరకు పట్టణంలోని మార్కెట్ కు వెళ్లాలన్న బస్సులోనే ప్రయాణం సాగిస్తున్నారు.దీనివల్ల ఆటోవాలాలకు గిరాకీ లేక ఆదాయం పూర్తిగా సన్నగిల్లింది. చదువుకున్న, చదువుకోకపోయినా డ్రైవింగ్ శిక్షణ పొంది ఆటోలను కొనుగోలు చేసి జీవనం సాగించేవారు. నెలసరికిస్తులతో ఆటోలను కొనుగోలు చేసి నడుపుకుంటూ క్రమంగా బాకీ ని తీర్చుకుని అవకాశం వారికి



ఉండేది. ఆటో నడవకపోగా, ఆశించినంతగా ఆదాయం సమకూరకపోవడంతో వాహన బాకీ ని తీర్చలేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.నెలసరి కిస్తూ కట్టలేదని ఫైనాన్స్ యజమానులు ఆటోలను లాకెళ్లే పరిస్థితి దాపురించింది. ఇటు ఆటో లేక, చేతినిండా పని లేక ఇంతకాలం హాయిగా బతికిన ఆటోవాలాల జీవనం దుర్భరంగా మారింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో వేలకొలది ఆటోలు నడుస్తున్నాయి. చాలా కుటుంబాలు ఆటో డ్రైవింగ్ పై ఆధారపడి ఉన్నాయి. ఉచిత ప్రయాణం పేరిట మహిళా ప్రయాణికులకు ప్రభుత్వం సానుకూల ధోరణితో వివరించినప్పటికీ, చర్య ప్రభావం ఆటోవాలాల బ్రతుకులపై పడింది.పొద్దంతా అడ్డాలో కూర్చుండి నిరీక్షించిన కేవలం 200 నుండి 500 వరకు కూడా సంపాదించలేకపోతున్నామని ఆటోవాలాలు ఆందోళన చెందుతున్నారు. పాలకులు ఆటోవాలాల విషయంలో ఆలోచించాల్సిన అవసరం ఉందంటూ మేధావులు పేర్కొంటున్నారు. మహిళలకు లాభం చేసి.. ఆటో రిక్షా వాళ్లకు నష్టం చేయడం ఎంత మటుకు సమంజసం అన్న వాదన సైతం వినిపిస్తోంది. ఆటో రిక్షా వారి జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వారికి కూడా తగు న్యాయం చేస్తే బాగుంటుందన్న డిమాండ్ తెరపైకి వస్తుంది.

**అప్పు కట్టలేక ఆటో అమ్ముకున్న**

ఆటో రిక్షాకు గిరాకీ లేక, ఆశించిన విధంగా ఆదాయం రాక అప్పు కట్టేందుకు ఆటో అమ్ముకునే పరిస్థితి దాపురించిందని బాన్సువాడ ఆటో డ్రైవర్ మౌలా ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో అమ్ముకొని జీవనోపాధి కోసం వెతికి పరిస్థితి ఏర్పడిందని వాపోయాడు. ఉచిత ప్రయాణం అమల్లోకి రాకముందు రోజువారీగా 1000 నుండి 1500 రూపాయలు ఆటో నడుపుకుంటూ సంపాదించే వాడినని, ప్రస్తుతం ఆటో నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆందోళన చెందాడు. పాలకులు ఆటో రిక్షా వారి బతుకులపై కూడా ఆలోచించి వారి మేలు కోసం తక్షణ చర్యలు చేపట్టాలని మౌలా డిమాండ్ చేశారు. తనే కాకుండా అడ్డాలో ఉన్న చాలామంది ఆటో డ్రైవర్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉందన్నారు. ప్రతి డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కాలం వెళ్ళదీస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం ఉచిత ప్రయాణం పేరిట పథకాన్ని అమల్లోకి తీసుకు రావడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని, మహిళలకు లాభం చేకూర్చి పాలకులు ఆటో డ్రైవర్ల బతుకులను దయనీయంగా తయారు చేశారని బాన్సువాడ ఆటో డ్రైవర్ దత్తు ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడ్డ డీజిల్ ఖర్చు ఫోను 200 కు పైన మిగలడం లేదని వాపోయాడు. 200 రూపాయలతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని దిగులు వ్యక్తం చేశారు.ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం ప్రతినెల పెన్షన్ రూపంలో అందించినట్లయితే ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశాడు. ఏదేమైపోయినప్పటికీ మహాలక్ష్మి పథకం ఆటో డ్రైవర్ల కలలను కల్లలు చేసింది. పిల్లాపాపలతో హాయిగా సాగిపోతున్న వారి కుటుంబాలను ఆర్థికంగా చిన్న భిన్నం చేసిందని చెప్పవచ్చు.పిల్లలను చదువుపించుకోలేక, వారి బాగోగులు చూడలేక ఆటో డ్రైవర్లు అపసోపాలు పడే పరిస్థితి నెలకొంది. ఆటో రిక్షా అనే సర్వస్వం అని నమ్మిన వారికి పాలకులు తీసుకున్న నిర్ణయం ఆటో వా లాల ఆదాయానికి భారీగా గండి కొట్టిందని చెప్పవచ్చు. ఆటో రిక్షా కార్మికుల విషయంలో ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న భావన మేధావుల్లో వ్యక్తం అవుతుంది.

# ఎమ్మెల్యేగా నేను ఫెయిల్

# కలకలం రేపుతున్న కామారెడ్డి MLA కామెంట్స్

**నిజామాబాద్, అక్టోబరు 30, పెన్ పవర్:**
2023 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అందరినీ ఆకర్షించిన నియోజకవర్గం కామారెడ్డి. ఈ నియోజకవర్గంలో కేసీఆర్, రేవంత్ రెడ్డి పోటీ చేశారు. బిజెపి నుంచి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీ చేశారు. వాస్తవానికి ఈ నియోజకవర్గంలో కెసిఆర్ గెలుస్తారని అందరూ అనుకున్నారు. కెసిఆర్ అనుకూల మీడియా కూడా ఇదేవిధంగా మాట్లాడింది. గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్ గెలవడం ఖాయమని స్వీయ కథనాలను రాసింది. కానీ ఫలితం అందుకు విరుద్ధంగా వచ్చింది.కామారెడ్డిలో కేసీఆర్ ను ఓడించి, రేవంత్ రెడ్డి ని ఓడించి విజయం సాధించారు కాటిపల్లి వెంకటరమణారెడ్డి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని నియోజకవర్గాలలో పరిస్థితి ఒక విధంగా ఉంటే.. తన నియోజకవర్గంలో మరో విధంగా ఉందని నిరూపించారు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి. ఎన్నికల సమయంలో కామారెడ్డి నియోజకవర్గంలో సొంత మేనిఫెస్టోను విడుదల చేశారు వెంకటరమణ రెడ్డి. ఏకంగా 150 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామని.. ఆయన అందులో పేర్కొన్నారు. పైగా కామారెడ్డి పట్టణానికి చెందిన వ్యక్తి కావడంతో అక్కడి ప్రజలు స్థానికుడు.. సేవా తత్పరుడు.. ఎటువంటి వివాదాలు లేని వ్యక్తి కావడంతో వెంకటరమణారెడ్డికి జై కొట్టారు. తమ వాడిగా ఆయనను గెలిపించుకున్నారు. గులాబీ పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ తాయిలాలు ఇచ్చినప్పటికీ వెంకటరమణారెడ్డికి అక్కడి ప్రజలు జై కొట్టారంటే ఆయన స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.ఇటీవల కామారెడ్డి ప్రాంతంలో విపరీతంగా వరదలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో వెంకట



రమణారెడ్డి పై కొన్ని మీడియా సంస్థలు కావాలని వ్యతిరేక కథనాలను రూపొందించాయి. అయినప్పటికీ వెంకటరమణారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉన్నారు. బాధితులకు అండగా ఉంటామని మాట ఇచ్చారు. వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నిత్యవసరాలు అందించారు. అయితే ఇప్పుడు వెంకటరమణారెడ్డికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో కనిపిస్తోంది. ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.. ఈ క్రమంలో తనకు తాను నాయకుడిగా సున్నా మార్కులు వేసుకుంటున్నారని.. నియోజకవర్గ అభివృద్ధికి ఏమీ చేయలేదని వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. దీని వెనుక ఉన్న అనేక కారణాలను ఆయన విశ్లేషించారు. అయితే గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా మాత్రం వెంకట రమణారెడ్డి మాట్లాడిన ఆ ఒక్క మాటను మాత్రమే ఎడిట్ చేసి తనకు అనుకూలంగా వాడుకుంటున్నది. కామారెడ్డి లో కెసిఆర్ ను వెంకటరమణారెడ్డి ఓడించడంతో.. దానిని మనసులో పెట్టుకొని నెగటివ్ ప్రచారం చేస్తోంది. ఇదే సమయంలో కాషాయ పార్టీ నాయకులు కూడా గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియాకు గట్టి కౌంటర్ ఇస్తున్నారు. మొత్తానికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎన్ని రకాలుగా దిగజారాలో.. అన్ని రకాలుగా దిగజారుతోంది. నాయకుల మీద వ్యక్తిగత విష ప్రచారం చేయడంలో ఆ పార్టీ సోషల్ మీడియా ఇటీవల మరింత బరితెగించిందని కమలం పార్టీ నాయకులు అంటున్నారు.కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి విషయంలో నేను విఫలమయ్యానుఎమ్మెల్యేగా నాకు నేను సున్నా మార్కులు వేసుకుంటా కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు

# సమష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దాం



**హైదరాబాద్ పెన్ పవర్:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టి గా మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు.
గురువారం ఉదయం పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులుతో ఎమ్మెల్యే సమీక్షించారు.
ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా మండలంలోని పంచాయితీలకు రూ.20 లక్షలు చొప్పున మంజూరైన నిధులు, చేపట్టదలచిన పనులు వివరాలను ఎంపీడీఓ మహమ్మద్ రఫీ
ద్వారా ఆరా తీశారు.ప్రస్తుతం నిధులు విడుదలైన వేలూరు, నీరువాయి పంచాయతీలలో త్వరిత గతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల స్మశానాలలో నిర్మించిన,నిర్మించనున్న బోర్ల వివరాలను ఇంజనీరింగ అధికారుల ద్వారా ఎమ్మెల్యే ఆరా తీశారు.అనంతరం ఎస్ ఎస్ బి పేటలో పేదలకు అందించనున్న భూమి పట్టా జాబితా పై తహశీల్దారు సుబ్రమణ్యం ద్వారా ఆరా తీశారు. వీటితో పాటు మండలంలోని ఇల్లు లేని లబ్ధిదారులకు వెంటనే ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దారుకు ఎమ్మెల్యే సూచించారు.మండలంలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలనిఅధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ప్రధానంగా వర్షాలు పడి నిలిచినందున గ్రామాల్లో పారిశుధ్యం పై దృష్టి సారించాలని, లేదంటే దోమలు పెరిగి అంటు వ్యాధులు, విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని ఎమ్మెల్యేవివరించారు.
ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతం

**జగిత్యాల, పెన్ పవర్:** :విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందుతున్న ఎస్.ఐ వెంకట్ రావు, ఏ.ఎస్.ఐ లు బాలాజీ,గజేంధర్,హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్,లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శాలువా,పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్పీ మాట్లాడుతూ ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటరమణ,రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు , మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లిని నిలదీసిన వృద్దురాలు

**హైదరాబాద్: పెన్ పవర్:**ఎర్రగడ్డ డివిజన్ లో ప్రచారం నిర్వహిస్తున్న మినిష్టర్ జూపల్లి కృష్ణ రావును వృద్ధురాలు గురువారం నిలదీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 4వేల రూపాయల పెన్షన్ ఎక్కడ అని ప్రశ్నించింది. కరెంట్ బిల్లు ఫ్రీ అన్నారు... కరెంట్ బిల్లు వస్తుంది అని వృద్ధురాలు వాపోయింది. ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు అడగడం తప్ప మిగిలిన టైంలో పట్టించుకోరా అని ప్రశ్నించింది.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు... ఎస్సై బాల నరసింహులు

**వ్యాసరచన పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన ఎస్ఐ.**

**తుగ్గలి: పెన్ పవర్:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తుగ్గలి ఎస్సై బాల నరసింహులు తెలియజేశారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల రాతన గ్రామం నందు ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాల యందు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పాఠశాల పరీక్షలలో ఉత్తమ మార్కులు తెచ్చుకున్న విద్యార్థినీలకు తుగ్గలి ఎస్సై బాల నరసింహులు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దేశ రక్షణలో అమరులైన పోలీసులను స్మరించుకోవాలని ఆయన తెలియజేశారు.దేశ రక్షణ కొరకు పోలీసుల విధులు,త్యాగాల గురించి విద్యార్థులకు ఆయన వివరించారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని ఆయన విద్యార్థులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజా రాణి, ఉపాధ్యాయునీలు మాధవి,స్వప్న, విద్యార్థినీలు,తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోజుల పాటు భారత్ పర్వ్ ఉత్సవాలు

**న్యూఢిల్లీ: పెన్ పవర్:**సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా 15 రోజుల పాటు భారత్ పర్వ్ ఉత్సవాలను ప్రకటించారు. ఈ ఉత్సవాలు నవంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం దేశ ఐక్యతను చాటి చెప్పేలా ఉంటుందని అయన వెల్లడించారు.

## కూలిపోయిన వీర బ్రహ్మేంద్ర స్వామి ఇల్లు.. పునరుద్ధరించాలన్న మంత్రి లోకేశ్

**కడప: పెన్ పవర్:**తుఫాను ప్రభావంతో కడప బ్రహ్మంగారి మఠంలోని శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి పురాతన నివాసం కూలిపోయింది. ఎడతెరిపిలేని వర్షాలతో మట్టి మిద్దె పడిపోయింది. స్వామి నివసించిన 16వ శతాబ్దం నాటి ఇంటికిమరమ్మతులు చేపట్టక కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందించారు. బ్రహ్మంగారి ఇంటి పునరుద్ధరణకు, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కడప కలెక్టర్ను ఆదేశించారు.

## అవనిగడ్డలో పవన్ కళ్యాణ్ పర్యటన



**అవనిగడ్డ: పెన్ పవర్:**కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం పర్యటించారు. కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో నేలకొరిగిన వరి పైరు పరిశీలించారు. అవనిగడ్డవిద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తుఫాన్ ప్రభావ దృశ్యాలతో కూడిన ఫోటో ఎక్సిబిషన్ పరిశీలించారు. పవన్ కళ్యాణ్ తో కలసి పర్యటనలో జిల్లా ఇంచార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలిబుద్ధ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డికే బాలాజీ తదితరులు పాల్గొన్నారు...

## అయ్యప్ప మాల ధరించిన విద్యార్థి అనుమతించని పాఠశాల యాజమాన్యం

**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:**పేట్ బాషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిది, పైప్ లైన్ రోడ్ లో గల షేర్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అత్యుత్సాహం వివాదస్పదమయింది. అయ్యప్ప మాల ధరించిన 6వ తరగతి విద్యార్థిని స్కూల్ లోకిస్కూల్ యాజమాన్యం అనుమతించలేదు. స్కూల్ ముందటే విద్యార్థి పడుగాపులు కాస్తున్నాడు. గత వరం రోజులుగా ఇలానే ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. పాఠశాల ముందు ఎబివిపి విద్యార్థిసంఘాలు ఆందోళనకు దిగాయి..

## వెంగళరావు నగర్ లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత ప్రచారం

**హైదరాబాద్: పెన్ పవర్:**బి.ఆర్.ఎస్. జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గురువారం వెంగళరావు నగర్ డివిజన్ కళ్యాణ్ నగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారంలో ఎమ్మెల్సీ తాతమధుసూదన్, తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా, బి.ఆర్.ఎస్. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ..

## ఏకధాటిగా పడుతున్న వానలు

## 11 జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటన

**విజయవాడ అక్టోబరు 30 పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొథా తుపాను ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించిన అల్లకల్లోలం ఇంకా కొనసాగుతూనే ఉంది. తుపాను వాయుగుండంగా మారి తెలంగాణ వైపు వెళ్లిపోయినా వర్షాల ప్రభావం ఏ మాత్రం తగ్గలేదు. పలు జిల్లాల్లో వానలు దంచి కొడుతున్నాయి. అందుకే అప్రమత్తమైన అధికారులు పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అప్రమత్తంగా ఉండాలని అవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచిస్తున్నారు. ఫ్లాష్‌ఫ్లడ్‌కు అవకాశం ఉందని అంటున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, కృష్ణా, మచిలీపట్నం జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఇంకా 24 గంటల పాటు తుపాను ప్రభావం ఉంటుందని అంటున్నారు. జోరు వానలు, అకస్మాత్తుగా కుండపోత వర్షాలు పడతాయని హెచ్చరిస్తున్నారు. రిస్క్ తీసుకోవద్దని అధికారులు చెబుతున్నారు. అవసరం అయితే కానీ ఎవరూ బయటకు రావద్దని హితవు పలుకుతున్నారు. మత్స్యకారులు కూడా వేటకు వెళ్లొద్దని వార్నింగ్ ఇచ్చారు. తీవ్ర ప్రభావం ఇవాళ రేపు ఉంటుందని తర్వాత నార్మల్ వర్షాలు పడతాయని అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలకు ఇప్పటికే పలు నదులు, వాగులు వంకలు పొంగుతున్నాయి. దీని కారణంగా రాష్ట్రంలోని పలు రిజర్వాయర్లు నిండుకుండలను తలపిస్తున్నాయి. పులిచింతల రిజర్వాయర్ కు వరద ఇన్ ఫ్లో 5లక్షల వరుకు చేరే అవకాశం ఉన్నందున ముందుగానే దిగువకు 4.9లక్షల క్యూసెక్కులు నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. దీని వలన ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేస్తారు. లోతట్టు ప్రాంత లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాలు జారీ చేసింది. తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది. చాలా ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఇంకా చాలా గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి. విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. చెరువులు వాగులు పొంగుతున్నాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే వంద కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మిగతా జిల్లాల్లో కూడా తుపాను అంచనాలు వేయడంలో అధికారులు తలమునకలై ఉన్నారు. వర్షాలు లేని వరద ముంపు ఎక్కువగా లేని ప్రాంతాల్లో అంచనాలు షురూ చేశారు. వాన గండం పొంచి ఉండటంతో ఇంకా సహాయక శిబిరాలను కంటిన్యూ చేస్తున్నారు. అక్కడ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అధికారులు చేస్తున్నారు.

తుపాను తీవ్రతను ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2వేలకుపైగా శిబిరాలను ఏర్పాటు చేసింది. దాదాపు రెండు లక్షల మందిని అక్కడకు చేర్చింది. వారికి ఆహారం, పాతిక కేజీల బియ్యం, మూడు వేలరూపాయల నగదు, నిత్యావసర సరకులు ఇచ్చారు. వారం రోజులుగా వేటకు వెళ్లని కుటుంబాలకు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు, నగదు కూడా అందజేయనున్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. లేకుంటే భారీ ప్రాణ నష్టాన్ని చూడాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

## కల్తీ లడ్డూ ప్రసాదంలో కొత్త ట్విస్ట్ తొలిసారి రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తి అరెస్టు

**తిరుమల, అక్టోబరు 30, పెన్ పవర్:** తిరుమల శ్రీనివాసుడి లడ్డూ ప్రసాదంలో వాడేందుకు కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందనే కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బుధవారం జరిగిన అరెస్టుతో ఇందులో కీలక వ్యక్తులను కూడా విచారిస్తారనే ప్రచారం జోరందుకుంది. అరెస్టు అయిన వ్యక్తి టీటీడీ మాజీ ఛైర్మన్‌కు మాజీ పీఏ అరెస్టు కావడంతో ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. వైసీపీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందని అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకుంది. కోర్టు ఆదేశాల మేరకు సిట్ ఏర్పాటు చేశారు. ఈ దర్యాప్తు బృందం ఇప్పటికే పలు కంపెనీలకు చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించింది. ఇన్ని రోజులు సైలెంట్‌గా విచారణ సాగుతున్న కేసు ఇప్పుడు మరో మలుపు తిరిగింది. ఇప్పటి వరకు రాజకీయాలకు నేరుగా సంబంధం లేని వ్యక్తులను మాత్రమే అరెస్టు చేసి విచారించారు. ఇప్పుడు తొలిసారిగా రాజకీయాలతో సంబంధం ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్, రాజ్యసభ ఎంపీ, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పని చేసిన అప్పన్నను సిటి బృందం బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుంది. విజయనగరానికి చెందిన అప్పన్న వైవీ సుబ్బారెడ్డి వద్ద 2014 నుంచి 2024 వరకు పీఏగా పని చేశారు. ఆయనే ఢిల్లీలో ఏపీ భవన్‌లో ప్రోటోకాల్ ఓఎస్డీగా కూడా విధులు నిర్వర్తించారు. వైసీపీ వ్యవహారాలు చక్కబెట్టిన వ్యక్తిని ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో అరెస్టు చేయడం సంచలనంగా మారింది. అప్పన్నను ఇప్పటికే సిట్ అధికారులు రెండుసార్లు విచారించారు. ఆ విచారణలో ఆయన సమాధానాలు సరిగా చెప్పలేదని అధికారులు చెబుతున్నారు. మరోసారి విచారణకు పిలుస్తారనే క్రమంలో అప్పన్న హైకోర్టును ఆశ్రయించి సిట్ విచారణపై స్టే తెచ్చుకున్నారు. అయితే దీనిపై సిట్ అధికారులు సుప్రీంకోర్టుకు వెళ్లి విచారణ సాగేలా వాదనలు వినిపించారు. కోర్టు సిట్‌కు అనుకూలంగా నిర్ణయం వెల్లడించింది. దీంతో విచారణ తిరిగి ప్రారంభించిన అధికారులు రెండు రోజుల నుంచి అప్పన్నను తిరుపతిలో ప్రశ్నిస్తున్నారు. ఆయన సరిగా సమాధానం చెప్పడం లేదని రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. సుబ్బారెడ్డితో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో తర్వాత ఏం జరగబోతోందనే ఆసక్తి నెలకొంది. సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే తిరుమలకు మూడు కంపెనీల నుంచి కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందని సిట్ ఆరోపిస్తోంది. ఇప్పటికే ఆయా కంపెనీల ప్రతినిధులను విచారించారు. ఇప్పుడు అప్పన్నను కూడా కస్టడీకి తీసుకొని విచారిస్తారు. దీంతో ఆయన చెప్పే విషయాలు ఆధారంగా సుబ్బారెడ్డిని కూడా విచారిస్తారా అనే అనుమానం అందరిలో ఉంది. ముందు అప్పన్నను కస్టడీలోకి తీసుకున్న తర్వాత కీలక పరిణాలు జరుగుతాయని అంటున్నారు.

## పాత బస్తీలో దారుణం

### అర్ధరాత్రి యువకుడిపై కత్తులతో దాడి.. హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** బండ్ల గూడ పోలీసు పరిధిలోని ఘౌస్నగర్లో బుధవారం అర్ధరాత్రి ఒక పాన్షాప్ యజమాని మొహ్సిన్ (35) ను గుర్తు తెలియని నలుగురు దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. సమాచారం అందుకున్నబండ్లగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత విభేదాలు, వ్యాపార వివాదం లేదా పాత కక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగిఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## ప్రకాశం బ్యారేజినుంచి నీరు విడుదల

**గుంటూరు: పెన్ పవర్:** భారీ వర్షాలకు పులిచింతల రిజర్వాయర్ కు వరద ఇన్ ఫ్లో 5లక్షల వరుకు చేరే అవకాశం ఉన్నందున ముందుగానే దిగువకు 4.9లక్షల క్యూసెక్కులు నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేసే అవకాశంఉంది. దీని వలన ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. లోతట్టు ప్రాంత లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## శ్రీశైలం-హైదరాబాద్ రాకపోకలు బంద్

**హైదరాబాద్: పెన్ పవర్:** బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తి ఉమ్మడి నల్గొండలోని డిండి ప్రాజెక్టు అలుగు వద్ద నీరు బ్రిడ్జి మీదుగా ప్రవహించింది. దీంతో జాతీయ రహదారి 765పై ఉన్న రోడ్డు కోతకు గురైంది.అప్రమత్తమైన అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసిహైదరాబాద్ -శ్రీశైలం రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని పోలీసులు సూచించారు. మరోవైపు శ్రీశైలంలో ఉన్నవారుగురువారం అక్కడే ఉండాలని తెలిపారు.

# బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదించే బాధ్యత మంత్రి కిషన్ రెడ్డి తీసుకోవాలి

**సీఎం రేవంత్ రెడ్డి బీసీ బిల్లు కోసం అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లాలి**

**నవంబర్ రెండు తర్వాత ఉద్యమంతో రాష్ట్రంలో భూకంపం సృష్టిస్తాం**

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**

**జయశంకర్ భూపాలపల్లి పెన్ పవర్:** అంబర్ పేట నుండి మూడుసార్లు శాసనసభ్యునిగా, సికింద్రాబాద్ నుండి రెండుసార్లు పార్లమెంట్ సభ్యునిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని బీసీలు గెలిపించారని, ఇప్పుడు గెలిపించిన బీసీల రుణం తీర్చుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించే బాధ్యత కిషన్ రెడ్డినే తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అంబర్ పేట నియోజకవర్గంలోని బీసీలు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆయనకు అండగా ఉన్నారని, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి బీసీ నేత బండా దత్తాత్రేయ తన సీటును త్యాగం చేసి కిషన్ రెడ్డికి కేటాయించారని, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న బీసీలు మరొకసారి కిషన్ రెడ్డికి అత్యధిక ఓట్లు వేసి పార్లమెంట్ సభ్యునిగా గెలిపించారని తద్వారా వారు రెండుసార్లు కేంద్ర క్యాబినెట్ మంత్రిగా బీసీల మద్దతుతోని అయ్యారని వేముల మహేందర్ గౌడ్ గుర్తు చేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని బీసీలు..బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర బంద్ నిర్వహించి లక్షలాది మంది రోడ్లమీదకి వచ్చి ఆందోళన చేపడుతున్నారని ఇలాంటి సమయంలో ఈ అంశాన్ని గమనించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని, విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల కూటాలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని.. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే బాధ్యత కిషన్ రెడ్డినే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి ఎన్నికలలో ఆయన రాజకీయ ఎదుగుదలకు అండగా ఉన్న బీసీల రిజర్వేషన్ల బిల్లుకు ఆమోద ముద్ర వేయించి బీసీల రుణం తీర్చుకోనే అవకాశం కిషన్ రెడ్డికి వచ్చిందని, ఇది ఆయన ఉపయోగించుకోవాలని మహేందర్ గౌడ్ సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించడానికి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ జరపాలని, ఒకవేళ ప్రధాని, సీఎం నేతృత్వంలోని అఖిల పక్షానికి సమయం ఇవ్వకపోతే ప్రధాని నివాసం ఎదుట వంట వార్పు కార్యక్రమం నిర్వహించి బీసీల నిరసనను దేశం మొత్తం చూసేలా సీఎం నిర్ణయం తీసుకోవాలని మహేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. నవంబర్ 2న హైదరాబాదులో కళింగ భవన్ లో బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని, ఆ సమావేశంలో భవిష్యత్తు ఉద్యమ కార్యచరణను బీసీ జేఏసీ రాష్ట్ర నాయకత్వం ప్రకటిస్తుందని, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం భూకంపం సృష్టించైన 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామనే నమ్మకం ఉందని మహేందర్ గౌడ్ తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం గత 18న ఇచ్చిన రాష్ట్ర బంద్ విజయవంతం అయ్యిందని, బీసీ బంద్ ద్వారా బీసీల డిమాండ్ ను బలంగా వినిపించ గలిగామని, కేంద్రంలో ఉన్న బిజెపిని, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకురావడానికి బీసీలంతా ఐక్యమత్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాలం చెల్లిపోతున్న కాంగ్రెస్ గ్యారంటీలు

**హైదరాబాద్, అక్టోబరు 30, పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయంలో ఐదు గ్యారంటీలు కీలక పాత్ర పోషించాయి. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పి ఇక్కడ కూడా అవే హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారు. తర్వాత రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేశారు. దానిపైనా విమర్శలు ఉన్నాయి. ఇక ఎలాంటి గ్యారంటీని అమలు చేయలేదు. సమీప కాలంలో అమలు చేస్తామని కూడా చెప్పలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నలు సంధిస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ' గ్యారంటీలు' హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. 025 అక్టోబర్ నాటికి, ఈ హామీల్లో కీలకమైనవి అమలు కావడం లేదు. బడ్జెట్ 2025-26లో రూ.56,084 కోట్లు ఈ గ్యారంటీలకు కేటాయించినప్పటికీ, పూర్తి అమలు లేకపోవడంపై %దీ=ా, దీభ్రూ%లు తీవ్ర విమర్శలు గుప్పించాయి. కాంగ్రెస్ మేనిఫెస్టో 'అభయ హస్తం'లో ప్రకటించిన గ్యారంటీల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం ఉన్నాయి. ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. కానీ లబ్దిదారులు ఎంత మంది ఉన్నారో ఇప్పటి వరకూ ప్రకటించలేదు. రూ. 2 లక్షల రుణమాఫీకి రూ.20,617 కోట్లు ఖర్చు చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.



మహిళలకు %=జ% బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల సహాయం చాలా కొద్ది మందికి ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 నెలవారీ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ పథకం అమలు గురించి ఆలోచించడం లేదు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డు (రూ.5 లక్షలు), ఉద్యోగ శిక్షణకు రూ.4,000 స్టైపెండ్ అమలు కాలేదు చేయూత పథకం కింద సామాజిక పెన్షన్లు పేదలకు రూ.4,000 ఇస్తామని హామీ ఇచ్చారు. సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, రైతు సంక్షేమం, మహిళలు, యువత వంటి విభాగాల్లో చాలా హామీలు మేనిఫెస్టోలో 'బంగారు తెలంగాణ'కు సంబంధించి, ముఖ్యంగా మహిళలు, పెళ్లి, బంగారం సహాయం వంటి 'బంగారుతల్లి ' వంటి స్కీమ్‌లు ఉన్నాయి. పేద కుటుంబాల్లో కలిగిన బాలికలకు పెళ్లికి 10%స్త్ర% బంగారం ం రూ.1 లక్ష సహాయం ఇస్తామన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద %ూజ/ూ% కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పారు. రెండేళ్లుఅవుతున్నా.. ఇప్పటికీ అమలు చేయడం లేదు. గ్యారంటీలతో పాటు ఇంకా చాలా హామీలు ఇచ్చారు. కళ్యాణమస్తు కింద .. తులం బంగారం ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు.కానీ ఇవ్వడం లేదు. పేదలు ఎదురు చూసే అత్యంత ముఖ్యమైన పథకం.. పెన్షన్లు. ఏపీలో పెన్షన్లు పెంచడంతో తమకూ పెంచుతారని చాలా మంది ఎదురు చూస్తున్నారు. మహిళలకు ఇస్తామన్న రెండున్నర వేలు.. అలాగే ఆటోడ్రైవర్లకు సాయం వంటివి నేరుగా పేదలకు లింక్ అయి ఉన్నాయి. ఇతర పథకాల విషయంలో ఏమో కానీ వీటి అమలు కోసం.. వారు ఎదురు చూస్తున్నారు. రెండేళ్ల పాలన విజయవంతం అయిందని సంబరాలు చేయాలని రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారు. కానీ ఇలాంటి కీలక పథకాల అమలు విషయం ఈ సంబరాల్లో కచ్చితంగా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

# గరం...గరంగా పాలకుర్తి పాలిటిక్స్

**వరంగల్, అక్టోబరు 30, పెన్ పవర్:** ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీరెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి. పాలకుర్తి నియోజకవర్గంలో పాలిటిక్స్ గరం గరంగా నడుస్తున్నాయి. అధికార%ెూ% ప్రతిపక్ష పార్టీల మధ్య జరగాల్సిన పోటాపోటీ రాజకీయాలు స్వంత పార్టీలోనే జరుగుతున్నాయి. అధికార హస్తం పార్టీ నేతలు రెండుగా చీలిపోయి ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారట. దీంతో నియోజకవర్గ అభివృద్ధి మాట పట్టించుకునేవారు లేరని స్థానికులు అసంతృప్తికి లోనవుతున్నారట. ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీ రెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి ప్రజలు సంక్షేమం, అభివృద్ధిలో నియోజకవర్గం దూసుకుపోతుందని భావించారట. ఝాన్సీ రెడ్డి, యశస్వినీ రెడ్డిలు రాజకీయాలకు కొత్త కావడంతో%ెూ%. పార్టీలను పక్కనబెట్టి డెవలప్మెంట్ పైనే దృష్టి పెడతారని ఆశపడ్డారట. అయితే ఇప్పుడు తమ పరిస్తితి పెనం నుండి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన చెందుతున్నారట. సొంత నిధులు ఖర్చు పెట్టైనా అభివృద్ధి చేస్తామని హామీలు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఆమె అత్త ఝాన్సీ రెడ్డి నియోజకవర్గాన్ని మోడల్ గా నిలుపుతామని ప్రజలకు ప్రామిస్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులను సొంత నిధులు ఖర్చు పెట్టైనా పూర్తి చేస్తామని హామీల వర్షం గుప్పించారు. కానీ నెలల గడుస్తున్న కొద్దీ%ెూ%మాటలు తప్ప, అభివృద్ధి బాటలు కనిపించట్లేదట. నియోజకవర్గంలో అభివృద్ధి జరగట్లేదని స్వంత పార్టీ నేతలే తమ ఎమ్మెల్యేపై మండిపడుతున్నారట. కొంతమంది నేతలు ధైర్యం చేసి ప్రజలకిచ్చిన హామీల మాటేమిటని అడిగితే%ెూ%.పార్టీ నుండి వెలివేసి..మాతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ సినిమా డైలాగులు చెప్తున్నారట. గోదాంల నిర్మాణాలపై కాంగ్రెస్ నాయుకుడు ఫైర్. ప్రస్తుతం దేవరుప్పుల మండలంలో 5కోట్ల రూపాయల నిధులతో గోదాంల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. అయితే ప్రభుత్వ స్థలంలో అందరికీ అందుబాటులో ఉండే చోట నిర్మాణాలు చేయాలని సొంత పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దేవరుప్పుల శివారులోని




మనుపాడ్ గుట్టలను తొలగించి గోదాంల నిర్మాణం చేయాలని కొందరు నేతలు సూచిస్తున్నారు. అయితే పర్యావరణానికి హాని జరిగేలా%ెూ%గుట్టలను తొలగిస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి ఫైర్ అయ్యారు. దీంతో ఆగ్రహానికి లోనైన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మరో సినిమా డైలాగ్ అందుకున్నారట. గ్రామస్తుల నిర్ణయం చెప్తే%ెూ%ఈ డైలాగులు ఏంటని కాంగ్రెస్ శ్రేణులే విస్తుపోయారట. ప్రజల సంక్షేమం కోసం మాట్లాడితే వార్నింగ్ ఇస్తున్న అత్త ఝాన్సీ. గత కొద్ది నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని నిరసనలు జరుగుతున్నాయి. ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలని కొంతమంది హస్తం పార్టీ నేతలే పట్టుబడుతున్నారట. ఇలా ప్రజల సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడితే%ెూ%.తమతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ తమ చుట్టూ ఉన్న నేతలకే వార్నింగ్స్ ఇస్తున్నారట ఎమ్మెల్యే అత్త ఝాన్సీ రెడ్డి. అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికుల అసంతృప్తి. నియోజకవర్గంలోని గ్రామాలలో రోడ్ల పరిస్తితి అధ్వాన్నంగా మారి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఖమ్మం హైవే ప్రతిరోజూ ప్రమాదాలతో రక్తసిక్తంగా మారుతోంది. సమస్యలు చెప్పుకుంటే మళ్ళీ సినిమా డైలాగులు చెప్తారేమోనని సైలెంట్ గా బాధలు అనుభవిస్తున్నారట నియోజకవర్గ ప్రజలు. రాజకీయాలకు అతీతంగా తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎర్రబెల్లిని ఓడిస్తే%ెూ% అభివృద్ధి సంక్షేమం దేవుడెరుగు సమస్యలు చెప్పుకుంటే రీసౌండ్ లో డైలాగులు వినాల్సి వస్తుందని లోలోపలే మదన పడుతున్నారట పాలకుర్తి ప్రజలు. అభివృద్ధిలో దూసుకెళ్తామనుకున్న ఆశలన్నీ అడియాసలైనట్లేనని తలలు పట్టుకుంటున్నారట నాయకులు.

# ఎంజీఎంలో ఏం జరుగుతోంది...

**వరంగల్, అక్టోబరు 30, పెన్ పవర్:** వైద్యులను ప్రాణదాతలు అని పిలుస్తుంటారు. కనిపించే దేవుళ్ళుగా రోగులు కొలుస్తుంటారు. అటువంటి గొప్ప పేరు ఉన్న వైద్యులు రోగులకు చికిత్స అందించి.. ఇంకా మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉండగా.. చికిత్సను పక్కనపెట్టి దోపిడికి పాల్పడుతున్నారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో అతిపెద్దదైన ఎంజీఎం లో అవినీతి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల ఈ ఆసుపత్రిలో ఒకటే ఆక్సిజన్ సిలిండర్ ను ఇద్దరు చిన్నారులకు పెట్టడం చర్చకు దారి తీసింది. దీనిపై మీడియాలో ప్రముతంగా వార్తలు రావడంతో వైద్య శాఖ మంత్రి ఎంజీఎం పై చర్యలు తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే అందులో నిజం లేదని తర్వాత తేలింది.. ఇటీవల ఎంజీఎం లో రోగులపై సెక్యూరిటీ గార్డ్ లు దాడి చేశారు. ఆ దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా మీడియాలో విపరీతంగా కనిపించాయి. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం..

మీడియాలో ప్రముఖంగా రావడంతో ఎంజీఎం సూపరిండెండెంట్ పై చర్యలు తీసుకున్నది.ఈ సంఘటన తర్వాత ఎంజిఎం లో ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎంజీఎం లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రెండు కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా కావడంతోపాటు టెండర్లు వేయకుండానే స్టేషనరీ కొనుగోలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ఆస్పత్రి వర్గాలలో చర్చకు దారితీస్తోంది. ఎంజీఎం లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల్లో ఒకరు ఈ అవినీతి వ్యవహారాన్ని మీడియాకు లిక్ చేసినట్టు తెలుస్తోంది. ఓ వర్గం ఎంజీఎంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తోందని.. పై అండలు చూసుకుని అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని మరో వర్గం ఆరోపిస్తోంది. మరో వర్గానికి చెందిన ఉన్నతాధికారి మీడియాకు లింకులు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది.

ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపడితే నిజాలు బయటపడతాయని తెలుస్తోంది. ఎంజీఎం కొత్త బాస్ దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని రోగులు అంటున్నారు.ఇటీవల కాలంలో సెక్యూరిటీ గార్డులు కూడా రోగులపై దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు పై అండదండలు తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలున్నాయి.. కొత్త బాస్ సెక్యూరిటీ గార్డుల వ్యవహార శైలి పట్ల దృష్టి సారించాలని.. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు. వైద్య సేవల విషయంలో పారదర్శకతను పెంపొందించాలని కోరుతున్నారు.

# క్యాష్ ఫర్ జాబ్... తమిళనాడును కుదిపేస్తున్న స్కామ్

**చెన్నై, అక్టోబరు 30, పెన్ పవర్:** తమిళనాడు రాష్ట్రంలో రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. అక్కడ అధికార పార్టీకి విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే చుక్కలు చూపిస్తోంది. తాజాగా టీవీకే పార్టీ తమిళనాడు రాష్ట్రంలో చోటు చేసుకున్న కుంభకోణాన్ని బయటపెట్టింది. ఇది ఆ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో చోటుచేసుకుందని టీవీకే ఆరోపించింది. టీవీకే ఆరోపణల ప్రకారం చూసుకుంటే.. తమిళనాడు రాష్ట్రంలోని మునిసిపల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల భర్తీ నిర్వహించారు. ఈ క్రమంలో ఒక్క ఉద్యోగానికి 25 నుంచి 35 లక్షల వరకు లంచాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఓ మనీలాండరింగ్ కేసు కు సంబంధించిన వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు నిర్వహించింది. తద్వారా ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై తమిళనాడు పోలీస్ శాఖకు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ లేఖ రాసినట్టు తెలుస్తోంది. ఈ ముడుపుల వ్యవహారంలో బలమైన వ్యక్తులు ఉన్నారని ఈడీ అధికారులు అభియోగాలు మోపినట్టు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్రంలోని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ల పోస్టుల భర్తీకి 2024 లో రిక్రూట్మెంట్ ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ ఉద్యోగాలకు తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన తమిళనాడు ప్రభుత్వం 2,538 ని ఎంపిక చేసింది. వీరికి గత ఏడాదిలో ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక పత్రాలు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. ముఖ్యంగా 150 మంది అభ్యర్థులకు ప్రయోజనం కలిగించే విధంగా పరీక్షలలో అక్రమాలకు పాల్పడినట్టు కేంద్ర దర్యాప్తు సంస్థ అభియోగాలలో వెల్లడించింది. ఈ 150 మంది అభ్యర్థుల నుంచి 25 నుంచి 35 లక్షల చొప్పున డబ్బులు తీసుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ వ్యవహారం వెనుక అనేక మంది రాజకీయ నాయకులు.. ఇంకా కొన్ని సంస్థలు ఉన్నట్టు ఈడి ఆరోపించింది. ఈ వ్యవహారం పై దర్యాప్తు జరపాలని తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ కు ఈడి లేఖ రాయడం కలకలం కలిగిస్తోంది. ఈ అక్రమాలకు సంబంధించి 232 పేజీలతో ఆధారాలు కూడా.

ఈ పరీక్షను అన్నా యూనివర్సిటీ నిర్వహించింది. ఆ విశ్వవిద్యాలయంపై కూడా దర్యాప్తు చేపట్టాలని ఈడీ కోరినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని తమిళనాడు మీడియా పట్టించుకోకపోయినప్పటికీ.. టీవీకే పార్టీ అధినేత ప్రధానంగా దృష్టి సారించారు. ఇటీవల కరూర్ ప్రాంతంలో జరిగిన తొక్కిసలాట ఘటన విషయంలో విజయ్ ని అధికార డిఎంకె టార్గెట్ చేసింది. అనుకూల మీడియాలో అడ్డగోలుగా కథనాలను ప్రసారం చేయించింది. అయితే అనువైన సమయం కోసం ఎదురుచూస్తున్న విజయ్.. అదును చూసి డీఎంకేను దెబ్బ కొట్టారు.. అంతేకాదు తమిళనాడు రాష్ట్రంలో ఉద్యమాలు నిర్వహించడానికి కసరత్తులు కూడా చేస్తున్నారు.

# ముందుకొస్తున్న సముద్రం... మత్స్యకారుల పూజలు

**బాపట్ల, కాకినాడ, అక్టోబరు 30,పెన్ పవర్:**
ఏపీలో మొంథా తుఫాను వణుకు పుట్టించింది. రాష్ట్రం చిగురుటాకుల వణికిపోయింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ పెను విపత్తు తీరం వైపు వచ్చే క్రమంలో ప్రతిక్షణం భయం భయమే. ఒకవైపు భారీ ఈదురుగాలులు, ఇంకోవైపు కుండపోతగా వానలు, మరోవైపు ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేశాయి. శ్రీకాకుళం జిల్లా డుంకూరు నుంచి తిరుపతి జిల్లా తడ వరకు బంగాళాఖాతంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఎక్కడికక్కడే సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చింది. దీంతో తీర ప్రాంతంలో భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. చాలాచోట్ల తీరం కోతకు గురైంది. ప్రతి జిల్లాలోని తీరప్రాంతాల్లో ఇది స్పష్టంగా కనిపించిందితుఫాన్ దాటికి కాకినాడ తీరం అల్లకల్లోలంగా మారింది. తాళ్లరేవు నుంచి తొండంగి వరకు తీరం వెంబడి అలలు ఉవ్వెత్తిన ఎగసిపడ్డాయి. తుఫాన్ తీరానికి సమీపిస్తున్న కొద్ది సముద్రంలో అలజడి మరింత తీవ్రంగా మారింది. తీరం వెంబడి రాళ్లగుట్టలు ఉన్నచోట ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తులో అలలు ఎగసిపడ్డాయి. శ్రీకాకుళం జిల్లాలోని తీర ప్రాంతంలో సైతం ఇదే పరిస్థితి ఎదురయింది. విశాఖ లో సైతం అలలు ఎగసి పడటం, సముద్రం ముందుకు రావడం వంటి కారణాల తో బీచ్ ప్రాంతాలను పూర్తిగా మూసివేశారు. అటువైపుగా పర్యాటకులను రానివ్వలేదు. ఉప్పాడ మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అర కిలోమీటర్ దూరం వరకు సముద్రపు అలల శబ్దం వినిపించడంతో మత్స్యకారులు భయపడిపోయారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదని చెబుతున్నారు. తీరానికి చెంతనే ఉన్న వందలాది గ్రామాలకు సముద్రపు నీరు చుట్టుముట్టింది. దీంతో అధికారులు మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించారు. సముద్రుడి ఉగ్రరూపం చూసి తీర ప్రాంతం వెంబడి మత్స్యకారులు(తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలో చాలా విపత్తులు చూసామని.. ఏకకాలంలో వాన, ఈదురు గాలులు

ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. అయితే ముందస్తు హెచ్చరికల విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఈ అల్పపీడనం తీవ్ర

తీవ్ర తుఫాన్ గా మారిన క్రమంలో ఏపీ ప్రభుత్వం ముందుగానే అప్రమత్తం అయ్యింది. ముందుగా మత్స్యకారులను అప్రమత్తం చేసింది. అప్పటికే చేపల వేటకు వెళ్లిన వారిని తీరానికి చేర్చింది. అయితే సముద్రం అల్లకల్లోలంగా మారిన క్రమంలో ఎక్కడికక్కడే మత్స్యకార మహిళలు పూజలు చేశారు. సముద్రుడు ఉగ్రరూపం నుంచి శాంతించాలని కోరుతూ తీరం వద్దకు వచ్చి మహిళలు పూజలు చేయడం కనిపించింది. అయితే తీరానికి తుఫాన్ తాకిన క్రమంలో 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. మొత్తానికైతే సముద్రుడి ఉగ్రరూపంతో మత్స్యకారులు బెంబేలెత్తిపోయారు.

# కలకలం రేపుతున్న ఆపరేషన్ షట్టర్

**జైపూర్, అక్టోబరు 30, పెన్ పవర్:** ఆపరేషన్ షట్టర్ డౌన్ లో రాజస్థాన్ లోని ఝులావర్ పోలీసులు కేంద్ర ప్రభుత్వ సామాజిక పథకాలకు సంబంధించిన దేశంలోనే అతిపెద్ద సైబర్ మోసాన్ని బయటపెట్టారు. ఈ ముఠాలోని ఎనిమిది మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ లోని కలెక్టర్లతో సహా దేశవ్యాప్తంగా 1,256 మంది అధికారుల లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను తస్కరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తులు 4,00,000 అద్దె ఖాతాలకు కోట్ల రూపాయలను బదిలీ చేశారు. జైపూర్‌లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా ఉన్న మహ్మద్ లాయక్ ఈ మోసానికి ప్రధాన సూత్రధారిగా పోలీసులు నిర్ధారించారు. ఈ కుంభకోణంలో కేంద్ర ప్రభుత్వ అధికారి కూడా ప్రమేయం ఉందని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే 11,000 ఖాతాలను స్తంభింపజేశారు. 10,000 ఖాతాలపై దర్యాప్తు జరుగుతోంది. ఇందుకు సంబంధించి ఝులావర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. "ఇప్పటివరకు ఎంత డబ్బు బదిలీ చేశారన్న దానిపై దర్యాప్తు జరుగుతోంది" అని అన్నారు. నాగౌర్, టోంక్, బార్మెర్, ఝులావర్, భరత్‌పూర్, ఫలోడి కలెక్టర్ల లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, జనధార్ పోర్టల్, సామాజిక భద్రతా పెన్షన్ పోర్టల్, విపత్తు నిర్వహణ శాఖ కు చెందిన %ణవీ×ూ% పోర్టల్ ద్వారా మోసానికి పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. మోసగాళ్ల నెట్‌వర్క్ రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అస్సాం, మణిపూర్ సహా అన్ని రాష్ట్రాలలో విస్తరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసిన నిందితుల్లో రాష్ట్ర నోడల్ కార్యాలయంలోని ఆపరేటర్ల నుండి కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగుల వరకు ఉన్నారని పోలీసు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి లక్షలాది మంది లబ్ధిదారులకు చెందిన అనుమానాస్పద డేటా, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లను హ్యాక్ చేయడం ద్వారా లక్షలాది రూపాయలను మోసం చేశారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి పథకం కింద వారు అనేక మంది నకిలీ రైతులను కూడా సృష్టించారు. ఫలితంగా కోట్లాది రూపాయలను కొట్టగొట్టారు. నిందితుడు మొహమ్మద్ లాయక్ జైపూర్‌లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే అదునుగా రాష్ట్ర నోడల్ కార్యాలయం అధికారిక ఐడీలను యాక్సెస్ చేయగలిగాడని పోలీసు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు అధికారం కోసం ఉపయోగించడానికి రాష్ట్రంలోని జిల్లా నోడల్ కార్యాలయాల నుండి ఐడీలను సృష్టించడానికి అతను దీనిని ఉపయోగించాడు. నిందితులు కార్యాలయ సమయాల్లో, సాధారణంగా రాత్రి సమయంలో చట్టవిరుద్ధంగా సృష్టించిన లను యాక్టివేట్ చేసి, ఉదయం కార్యాలయం నుండి తిరిగి వచ్చిన తర్వాత వాటిని డీయాక్టివేట్ చేసేవాడని ఎస్పీ తెలిపారు. ఏజెంట్లు క్లోజ్డ్ ఖాతాల డేటాను సేకరించి నోడల్ అధికారి లాగిన్ ద్వారా పంపారని ఎస్పీ తెలిపారు. గ్రామాల్లో, ముఠా ఏజెంట్లు అనర్హులైన లబ్ధిదారుల డేటాను సేకరించారు. వారి రిజిస్ట్రేషన్ ల్యాండ్ సీడింగ్ లేదా ఇతర కారణాల వల్ల నిష్క్రియంగా ఉంది. వారు పథకాలకు మళ్లీ జోడించే నెపంతో ఆధార్, ఖాతా వివరాలను ప్రధాన ఏజెంట్‌కు ఇచ్చారు. తర్వాత వారు ఎక్సెల్ షీట్‌ను రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్‌కు పంపారు. రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్ జిల్లా నోడల్ అధికారుల కొత్త ఐడీలను సృష్టించారు. రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్, మోసగాళ్ళు ని దాటవేయడం ద్వారా అనర్హులైన వ్యక్తులను కిసాన్ సమ్మాన్ నిధికి అనధికారికంగా అర్హులుగా చేయడానికి కార్యాలయ సమయాల్లో, రాత్రి సమయం తర్వాత లాగిన్ లను ఉపయోగించారు. తరువాత, నిందితులు లాగిన్ లను తొలగించారని పోలీసులు తెలిపారు. మొహమ్మద్ లాయక్: అతను జైపూర్‌లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా ఉన్నాడు. రాష్ట్ర నోడల్ కార్యాలయం అధికారిక ఐడీ లను యాక్సెస్ చేయగలిగాడు. ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా ఉపయోగించడానికి రాష్ట్ర, జిల్లా నోడల్ కార్యాలయాల లను సృష్టించడానికి అతను దీనిని ఉపయోగించాడు. ఇదిలావుంటే, మరో నిందితుడు షఫీక్ ఝులావర్‌కు పారిపోయాడు. ప్రస్తుతం అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. మొహమ్మద్ షాహిద్: భరత్‌పూర్ నివాసి అయిన షాహిద్, ల్యాండ్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నప్పుడు, అనర్హుల మోసపూరిత యాక్టివేషన్‌లో లాయక్‌తో పరిచయం ఏర్పడింది. నైరుతి ఢిల్లీ నివాసి సుభాష్ కశ్యప్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని జలంధర్ నివాసి రోహిత్ కుమార్.. వివిధ రాష్ట్రాల రైతు పథకాల క్లోన్ వెబ్‌సైట్‌లను సృష్టించడం వెనుక ప్రధాన సూత్రధారి. పంజాబ్‌లోని జలంధర్ నివాసి సందీప్ శర్మ క్లోన్ వెబ్‌సైట్ డెవలపర్ జలంధర్ నుండి అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లోని జలంధర్ నివాసి సునత్ శర్మ, రాజస్థాన్ ఖరా జిల్లా ఫలోడి నివాసి రమేష్ చంద్ర, రాజస్థాన్‌లోని దోస్సా జిల్లా నివాసి భాగ్‌చంద్ సైనీని పోలీసులు అరెస్ట్ చేసి కూపీ లాగుతున్నారు.

# అజార్ బ్యాటింగ్ పైనే రేవంత్ ఆశలు

**హైదరాబాద్, అక్టోబరు 30, పెన్ పవర్:**
తెలంగాణలో జూబ్లీహిల్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడింది. సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. సత్తా చాటాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇక అధికారం కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడానికి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్, ఎమ్మెల్సీ అజారుద్దీన్‌ను జూబ్లీహిల్స్ ఎన్నికల మైదానంలోకి దించబోతోంది. ఇందులో భాంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా అజారుద్దీన్‌ను మంత్రిని చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల్లో అజార్‌తో మంత్రిగా ప్రమాణం చేయించి జూబ్లీహిల్స్ ఎన్నికల మైదానంలోకి దించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల ఢిల్లీకి వెళ్లి అధిష్టానం నుంచి ఇందుకు గ్రీన్‌సిగ్నల్ తెచ్చుకున్న ఆయన, ఉపఎన్నికలను కీలకమలుపు తిప్పబోతున్నారు. మాజీ క్రికెటర్‌గా జాతీయ గుర్తింపు కలిగిన అజార్ జూబ్లీహిల్స్‌లో మైనారిటీలతోపాటు యువతలో కూడా ప్రభావం చూపగల నాయకుడు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ అంతర్గత విభేదాలు ఆగిపోవడానికి, అలసిన కేడర్‌కు చైతన్యం తెచ్చేందుకు ఆయన ప్రవేశం దోహదపడవచ్చు. బీఆర్ఎస్ స్థానిక నేతలు ఇప్పటికే డిఫెన్సివ్ గేమ్‌లోకి వెళ్లినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అజార్ మంత్రిగా నియమితులైతే, ఆయన క్యాబినెట్ ప్రతినిధిగా నిర్వహించే

ప్రాధాన్యత జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటర్లపై మానసిక ప్రభావం చూపడం ఖాయం. కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఈ సీటును ప్రతిష్టాత్మకంగా మార్చి, మైనారిటీల ఓటు ధోరణిని కాపాడే కదలికలతో ముందుకు వస్తోంది. ఇక బీఆర్ఎస్, బీజేపీ లెక్కల్లో ఈ క్రికెటర్ జూబ్లీహిల్స్ గ్రౌండ్‌లో ఎలా ఎదుర్కొంటాడు.. వారి ప్రచారాన్ని తనదైన శైలిలో ఎలా తిప్పకొడతాడు.. కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ యాదవ్‌ను ఎలా గెలిపిస్తాడన్న చర్చ జరుగుతోంది. అజార్ ప్రజాసభలు, ప్రచార శైలి, చర్చలలో కనిపించే సాఫ్ట్ టచ్ కాంగ్రెస్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచవచ్చు. తన ఖ్యాతి, మానవతా దృక్పథం కలగలిపిన ప్రచారంతో అజార్ గేమ్ మొనదేరితే ప్రతిపక్షాలు క్లీన్ బోల్డ్ అయ్యే అవకాశం ఉంది. లంగాణ క్యాబినెట్ విస్తరణలో అజహారుద్దీన్ కు చోటు లభిస్తుందని తెలుస్తోంది. కెప్టెన్ ఇటీవల జూబ్లీహిల్స్ టికెట్ ఆశించారు. ఆ టికెట్ విషయంలో
నవీన్ యాదవ్ కు ముఖ్యమంత్రి గట్టిగా నిర్ణయించుకున్న నేపథ్యంలో.. అత్యంత తెలివిగా అధిష్టానం వద్ద పావులు కదిపారు. ఆ తర్వాత అజహారుద్దీన్ కు ఎమ్మెల్సీ ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా మంత్రిని కూడా చేయబోతున్నారు. అతి త్వరలో అజహార్ మంత్రి కాబోతున్నారు. ఇదే విషయాన్ని రేవంత్ రెడ్డి అజహార్ కుమారుడితో చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి వద్ద విద్య, హోం, క్రీడా శాఖలు ఉన్నాయి. అజహార్ స్వతహాగా క్రికెటర్ కాబట్టి అతడికి క్రీడా శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తంగా జూబ్లీహిల్స్‌ను తన ఖాతాలో వేసుకునేందుకు రేవంత్‌రెడ్డి వ్యూహం ఏమేరకు సక్సెస్ అవుతుంది. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తుందా.. గెలిస్తే ఎంత మెజారిటీ తెప్పిస్తుంది అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇందుకోసం నవంబర్ 14 వరకు వేచి చూడాల్సిందే.

## ప్రాణాలను కాపాడిన డ్రోన్లు.

**బాపట్ల:పెన్ పవర్:** మొంథా తుఫాను సహాయక చర్యల్లో భాగంగా పరిస్థితి అంచనా వేసేందుకు ప్రభుత్వం డ్రోన్లను వినియోగించింది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతోన్న వ్యక్తిని డ్రోన్ ద్వారా గుర్తించారు. వెంటనే అలెర్టు కావడంతో వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఇదే కాకుండా.. లోతట్టు ప్రాంతాలను డ్రోన్ల సాయంతో పోలీసులు, అధికారులు పర్యవేక్షించారు. కొన్ని చోట్ల కొట్టుకుపోతున్నపశువులను డ్రోన్ల ద్వారా గుర్తించి ఒడ్డుకు చేర్చారు..

## పరుగులు పెడుతున్న వైట్ మెటల్

**ముంబై, అక్టోబరు 30,పెన్ పవర్:** వెండి ధరలు తగ్గాయి. ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గాయి, సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ వచ్చే ఏడాది వెండి పెట్టుబడిదారులకు 50 శాతం వరకు రాబడిని అందించగలదని నిపుణులు విశ్వసిస్తున్నారు. గత రెండు వారాల్లో వెండి ధర 18 శాతం తగ్గిన తర్వాత, స్టాక్ మార్కెట్ వెలుపల ఆదాయం కోసం చూస్తున్న పెట్టుబడిదారులు కొత్తగా వెండిని కొనుగోలు చేయడాన్ని పరిగణించవచ్చు. ఇటీవలి బలహీనత ఉన్నప్పటికీ వచ్చే ఏడాది నాటికి వెండి 50 శాతం వరకు తిరిగి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. రాబోయే కొన్ని నెలల్లో వెండి ధరలు ఔన్సుకు 50–55 డాలర్ల మధ్య స్థిరంగా ఉంటాయని, ఇటీవలి గరిష్టాల నుండి కొంత లాభం కోలుకునే అవకాశం ఉందని మేం విశ్వసిస్తున్నాము అని నిపుణులు అంటున్నారు. 2026 చివరి నాటికి ఇది ఔన్సుకు 75 డాలర్లకి చేరుకోవచ్చు. డాలర్ 90 వద్ద ఉంటే, దేశీయ ధరలు కిలోకు రూ.240,000కి చేరుకోవచ్చు. అంతర్జాతీయ వెండి ధరలు అక్టోబర్ 16న ఔన్సుకు 54.45 డాలర్ల నుండి 10.9 శాతం తగ్గి 48.59 డాలర్లకి చేరుకున్నాయి, దేశీయ ధరలు అక్టోబర్ 14న కిలోకు రూ.182,500 నుండి 18 శాతం తగ్గి రూ.149,500కి చేరుకున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో మెరుగుదల కారణంగా రిస్క్ అప్పిటైట్ మెరుగుపడటం, సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ పెరగడంతో విలువైన లోహాల పట్ల పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గింది, ఫలితంగా వెండి ధరలు తగ్గాయి. ఈ నెల ప్రారంభంలో భారీ ర్యాలీ తర్వాత ఈ తగ్గుదల వచ్చింది, దీని ఫలితంగా వ్యాపారులు లాభాలను బుక్ చేసుకున్నారు. గత సంవత్సరంలో వెండి డాలర్ పరంగా 44 శాతం, రూపాయి పరంగా 55.72 శాతం రాబడిని ఇచ్చింది.

# ప్రతి డివిజన్ కో మంత్రి
## సర్వశక్తులు ఒడ్డుతున్న కాంగ్రెస్




**హైదరాబాద్, అక్టోబరు 30, పెన్ పవర్: :** జూబ్లీహిల్స్‌ను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇతర సీనియర్లను నియోజకవర్గంలో మోహరించింది. హైదరాబాద్‌లో జరిగే రెండో ఉప ఎన్నికలోనూ పాగా వేయాలనే పట్టుదలతో ఉన్న కాంగ్రెస్ ప్రచారంలో వేగం పెంచింది. ఇప్పటికే కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలుపొందిన కాంగ్రెస్, ఇప్పుడు జూబ్లీహిల్స్ సైతం తన ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతున్నది. ఇందుకు గల్లీకో లీడర్, డివిజన్‌కో ఇద్దరు మంత్రులకు ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. 200 ఓట్లకు ఒకరికి బాధ్యతల ను కూడా అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, బైక్ ర్యాలీలలో సీఎం పాల్గొననున్నారు. అధ్యక్షు డు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్, పార్టీ సీని యర్లు జూబ్లీహిల్స్‌పై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇంటలిజెన్స్‌తోపాటు ప్రైవేట్‌గా కూడా ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నారు. ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. పోలింగ్ రోజు వరకు అప్రమత్తంగా ఉండి.. పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించుకునేందుకు బీసీ వాదాన్ని కూడా ముందుకు తీసు కొస్తున్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్న పాలమూరు జిల్లా వాసులతో సమావేశం నిర్వహించి కాంగ్రెస్‌కు అండగా ఉండాలని కోరారు.

**ప్రచార అస్త్రాలుగా అభివృద్ధి, సంక్షేమం..**

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి నెల రోజుల క్రితమే ముగ్గురు మంత్రులు తుమ్మ ల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిని ఇన్‌చార్జ్‌లుగా నియమించిన విషయం తెలిసిందే. వీరు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నా రు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నా రు. ఇప్పుడు ఏకంగా ప్రతి డివిజన్‌కు ఇద్దరు మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించడం ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌పై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న ఆరోపణలను పార్టీ నేతలు తిప్పికొడుతూ ప్రచారహోరును పెంచుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విషయంలో గులాబీ నేతలు సెంటిమెంట్‌ను ప్లే చేస్తుండగా, అందుకు ధీటుగా కాంగ్రెస్ నేత లు బీసీ కార్డును తెరపైకి తీసుకొస్తున్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ నియోజకవర్గానికి చేసిందేమిలేదనే విమర్శలతో ముందుకెళ్లుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున, ఇక్కడ పార్టీ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, ఆయా డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు.


**డివిజన్లవారీగా మంత్రులు**

నియోజకవర్గ బాధ్యతలను ఇప్పటికే ముగ్గురు మంత్రులకు అప్పజెప్పిన కాం గ్రెస్ పార్టీ, ఇక ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. రహమత్‌నగర్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బోరబండకు సీతక్క, ఎంపీ మల్లు రవి, వెంగల్‌రావునగర్‌కు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సోమాజిగూడకు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, షేక్ పేటకు కొండా సురేఖ, వివేక్, ఎర్రగడ్డకు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, యూసుఫ్‌గూడకు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ సీనియర్లు, ఇతర నాయకులు నియోజకవర్గవ్యాప్తంగా పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాలు చేస్తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నారు.

# పవన్ ఫీల్డ్ విజిట్

**విజయవాడ, అక్టోబరు 30, పెన్ పవర్:** మొంథా తుపాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలు చాలా తీవ్రంగా నష్టపోయాయి. ప్రస్తుతం నష్ట నివారణ అంచనాల్లో అధికారులు తలమునకలై ఉన్నారు. నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి విచారిస్తున్నారు. జరిగిన విపత్తు గురించి తెలుసుకుని రైతులకు భరోసా ఇచ్చేందుకు అధికార యంత్రాంగంతోపాటు నేతలంతా పొలం బాట పడుతున్నారు. బుధవారం పలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఇవాళ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలను విజిట్ చేసిన పవన్ – ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసాతుపాన్ ప్రభావంతో కృష్ణా జిల్లా అవనిగడ్డ పరిసర ప్రాంతాల్లో వరి పంటలు భారీగా నష్టపోయాయి. ఈ నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ ఈ ఉదయం అవనిగడ్డ నియోజకవర్గానికి చేరుకున్నారు. కొడూరు మండలంలో తుపాన్ ప్రభావంతో ధ్వంసమైన పంటలను పరిశీలించిన పవన్ నేరుగా రైతుల పొలాల్లోకి వెళ్లి వారితో మాట్లాడారు. రైతుల నష్టాలపై వివరాలు తెలుసుకుంటూ, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, పరిష్కార మార్గాలు గురించి చర్చించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుల పక్షాన నిలుస్తుందని పవన్ భరోసా ఇచ్చారు.

## ఎల్ ఆర్ఎస్ మరో 3 నెలలు గడువు




**విజయవాడ, అక్టోబరు 30, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ గడువు మరో మూడు నెలలు పొడిగించింది. అక్రమ, అనధికారిక లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఆగస్ట్ నెలలో ఏపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తీసుకువచ్చింది. ఈ గడువు అక్టోబర్ 31తో ముగుస్తోంది. అయితే లేఅవుట్ల డెవలపర్లు, ప్లాట్ల యజమానుల నుంచి ఊహించినంత స్పందన లేకపోవటంతో ఎల్ఆర్ఎస్ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని నిర్ణయం తీసుకుంది. జనవరి 23 వరకూ అవకాశం కల్పిస్తోంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం గడువును మరో 3 నెలలు పొడిగించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ను ఈ ఏడాది ఆగస్ట్ నెలలో ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఎల్ఆర్ఎస్ గడువు అక్టోబర్ 31న ముగియనుంది. అయితే ఎల్ఆర్ఎస్ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం జనవరి 23, 2026 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. అయితే లేఅవుట్ల డెవలపర్లు, ప్లాట్ల యజమానుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవటంతోనే ఎల్ఆర్ఎస్ గడువును ఏపీ ప్రభుత్వం పొడిగించినట్లు భావిస్తున్నారు.అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించడం కోసం ఆంధ్రప్రదేశ్ ఆమోదం లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు, 2020 కింద దరఖాస్తులను సమర్పించడానికి మరో మూడు నెలలు గడువు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని ఏపీ మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ గడువును 23.01.2026 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. మరోవైపు అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు నెలలో %టా=టా%ని తిరిగి ప్రవేశపెట్టింది. 2014 – 2019 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అమలు చేసింది. 2024 ఎన్నికల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం .. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన లేఅవుట్లపై అధ్యయనం చేపట్టింది. ఈ క్రమంలోనే అక్రమ లేఅవుట్లు ఎక్కువగా ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం.. ఖజానాకు అదనపు ఆదాయాన్ని సేకరించడానికి %టా=టా%ను తిరిగి ప్రారంభించింది. ఈ క్రమంలోనే మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ.. మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి అధికారులకు అక్రమ, అనధికార లేఅవుట్లను నియంత్రించాలని మార్గదర్శకాలను జారీ చేసింది. అక్రమ లేఅవుట్లను తొలగించాలని లేదా లేఅవుట్ల డెవలపర్లు %టా=టా% కింద దరఖాస్తులు చేసేలా ప్రోత్సహించాలని ఆదేశించింది. అయితే ఎల్ఆర్ఎస్కు ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవటంతో మరో మూడు నెలలు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. జనవరి 23వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

## మారుతోన్న స్వరం

**నెల్లూరు, అక్టోబరు 30, పెన్ పవర్:** ఏపీలోవైయస్సార్ కాంగ్రెస్ వాయిస్ మారుతోంది. తమకు తాము బలం పెంచుకొని గెలుస్తామన్న ధీమా ఉంటే పర్వాలేదు. కానీ కూటమి మధ్య విభేదాలు వస్తాయని.. సామాజిక వర్గాల లెక్కలు మారుతాయని.. అందుకే ఒంటరిగా పోటీ చేసే తాము గెలుస్తామని లెక్కలు వేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే ఇటువంటి లెక్కలు మూడుసార్లు వేసుకుంది ఆ పార్టీ. కానీ ఒక్కసారి మాత్రమే గెలిచింది. అయితే ఇప్పుడు అదే ఫార్ములా తో 2029లో సైతం గెలుస్తామన్న ధీమాతో ఉంది. కానీ అది ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందికరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా టిడిపి, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరుగుతోందని వైసీపీ చెబుతోంది. ఆ గ్యాప్ తమకు లాభమని అంచనా వేస్తోంది.ప్రధానంగా ఈసారి కాపు సామాజిక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ అవుతుందని వైసిపి అంచనాగా ఉంది. అందుకే కాపు సామాజిక వర్గంలో ఆగ్రహం, ఆవేదన పెంచే పనిలో పడింది. నందమూరి బాలకృష్ణ వైసిపి హయాంలో చిత్ర పరిశ్రమకు ఎదురైన పరిణామాల గురించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తనదైన శైలిలో జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు చేశారు. అయితే చిరంజీవిని తెరపైకి తెచ్చి కాపు సామాజిక వర్గాన్ని, మెగా అభిమానుల ముసుగులో రాజకీయం చేయాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇంకోవైపు కందుకూరు లో ఓ హత్యను కాపు, కమ్మ సామాజిక వర్గ మధ్య జరిగిన ఆధిపత్య పోరుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. కాపుల్లో ఒక రకమైన మార్పు కోసం ఈ ఘటనను సాకుగా చూపే సాహసం చేసింది. కానీ ఈ విషయంలో అనుకున్నంత సక్సెస్ కనిపించలేదు.టిడిపి, జనసేన, బిజెపి నాయకత్వం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టత ఉంది. ఆ మూడు పార్టీలు మరో 15 ఏళ్ల పాటు కలిసి వెళ్తాయని వారు బాహాటంగానే చెప్పుకొస్తున్నారు. ఏకంగా రాయలసీమ వచ్చి ప్రధాని నరేంద్ర మోడీ కీలక ప్రకటన చేశారు. పవన్ కళ్యాణ్ పార్టీ చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తామని తేల్చి చెప్పారు. అందుకే ఇప్పుడు నాయకత్వంతో పని లేకుండా రెండు పార్టీల క్యాడర్ పై ఆశగా ఎదురుచూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలు సమీపిస్తున్న కొలది ఆ రెండు పార్టీల క్యాడర్ మధ్య గ్యాప్ పెరుగుతుందని అంచనా వేస్తోంది. 2024 ఎన్నికలకు ముందు కూడా క్యాడర్లో ఇదేవిధంగా గ్యాప్ వస్తుందని అంచనా వేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అటువంటిది ఏమీ లేకుండా పోయింది. రెండు పార్టీల మధ్య సమన్వయం సాగింది. టిడిపి తో జనసేన కలవడాన్ని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల అనుకూలమైన వాతావరణం ఉన్నవారు జనసేనను విడిచిపెట్టి వెళ్లిపోయారు. పవన్ కళ్యాణ్ కూడా స్పష్టమైన ప్రకటన చేశారు. టిడిపి తో కలయిక ఇష్టం లేనివారు బయటకు వెళ్ళిపోవచ్చు అని తేల్చి చెప్పారు. 2029 ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్ ఇదే విషయం చెబుతారు. కానీ ఎందుకో ప్రభుత్వ వైఫల్యాలపై కాకుండా.. ఆ రెండు పార్టీల క్యాడర్ మధ్య వచ్చే గ్యాప్ పై ఆశలు పెట్టుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.

## కమలమా... సైకిలా...ఆలోచనలో వీవీ

**విశాఖపట్టణం, అక్టోబరు 30, పెన్ పవర్:** :వి.వి. లక్ష్మీనారాయణ రాజకీయ పార్టీ పెట్టారు. జై భారత్ నేషనల్ పార్టీని పెట్టిన లక్ష్మీనారాయణ ప్రస్తుతం జనం సమస్యలకు దూరంగా ఉంటున్నారు. ఆయన గతకొంతకాలంగా రాజకీయ కార్యక్రమాల్లోనూ పెద్దగా పాల్గొనడం లేదు. సొంత పార్టీ పెట్టిన లక్ష్మీనారాయణ ఏపీలో ఏదైనా రాజకీయ పార్టీలో చేరే అవకాశముందా? అన్న చర్చ కూడా జరుగుతుంది. అయితే ఆయన మాత్రం బయటపడటం లేదు కానీ, లక్ష్మీనారాయణకు మాత్రం పార్లమెంటు సభ్యుడిగా ఎన్నిక కావాలని బలంగా ఉంది. విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికై లోక్ సభలో అడుగుపెట్టాలని భావించినప్పటికీ రెండుసార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. మరి వచ్చే ఎన్నికలకు ఎలాంటి వ్యూహంతో వెళ్లనున్నారన్నది హాట్ టాపిక్ గా మారింది.. జేడీ లక్ష్మీనారాయణగా దక్షిణాది రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 1990 నాటి ఐపీఎస్ అధికారి అసలు పేరు వీవీ లక్ష్మీనారా యణ. సీబీఐలో జాయింట్ డైరెక్టర్ గా పనిచేయడంతో ఆయన పేరు జేడీ లక్ష్మీనారాయణగా స్థిరపడిపోయింది. దాదాపు ఏడేళ్ల సర్వీసు ఉండగానే ఉద్యోగానికి స్వచ్ఛంద రాజీనామా ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. సౌమ్యుడిగా, విజ్ఞాన వంతుడిగా ఆయనకు ఎంతో పేరుంది. మృదు స్వభావిగా కూడా ఆయన పేరు తెచ్చుకున్నారు. వృత్తి రీత్యా ఐపీఎస్ అయినప్పటికీ.. ఆయనలో ఎక్కడా కఠినత్వం జాడలు కూడా మనకు కనిపించవు. ముఖ్యంగా విద్యా విషయాలు, విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం వంటి అంశాల్లో జేడీది అందె వేసిన చేయి. వివేకానందుని బోధనలు, దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలా భావనలను జేడీ ఎంతో నమ్మడమే కాకుండా వాటిని ప్రచారం కూడా చేస్తారు. ఇక, ఇప్పుడు ఆయన రాజకీయ నిర్ణయంపై అందరిలోనూ ఆసక్తి ఉంది. మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యావత్మల్ సబ్‌డివిజన్ ఏఎస్పీగా మూడేళ్లు, నాందేడ్ ఎస్పీగా మూడేళ్ళు పనిచేశారు. పుణేలోని సాయుధ పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిం చారు. డీఐజీగా పదోన్నతి పొందిన తర్వాత కేంద్ర సర్వీసులకు వెళ్లి సీబీఐలో బాధ్యతలు స్వీకరించి హైదరాబాద్ విభాగానికి బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని సీబీఐ విభాగానికి 2006 నుంచి ఏడేళ్లపాటు నేతృత్వం వహించారు. ఇక్కడ ఉన్నప్పుడు లక్ష్మీనారాయణ ఐజీగా పదోన్నతి పొందారు. ఏడేళ్లలో అక్రమాస్తుల కేసులో జగన్‌తోపాటు ఐఏఎస్ అధికారులు, మంత్రులను అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సత్యం కంప్యూటర్ కుంభకోణమూ ఆయన నేతృత్వంలోనే దర్యాప్తు సాగింది. ఓబులాపురం మైనింగ్ కుంభకోణంలో కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డిని అరెస్టు చేశారు. విశాఖ పార్లమెంటు నుంచి... అయితే లక్ష్మీనారాయణ 2019 ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2029 ఎన్నికల నాటికి తన సొంత పార్టీ కాకుండా ఆయన ఏదైనా పార్టీలో చేరి విశాఖపట్నం నుంచి విజయం సాధించాలని కోరుకుంటున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరిస్తారన్న సమయంలోకూ స్టీల్ ప్లాంట్ కార్మికులకు అండగా నిలిచారు. అవసరమైతే తాను టెండర్లలో పాల్గొంటానని చెప్పారు. అలాంటి లక్ష్మీనారాయణ ఇటీవల కాలంలో విశాఖలోనూ పర్యటించడం చాలా అరుదుగానే జరుగుతుంది. ఆయన వచ్చే ఎన్నికల నాటికి మాత్రం ఏదో ఒక పార్టీలో చేరి విశాఖపార్లమెంటు నుంచి పోటీ చేయడం ఖాయమని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏ పార్టీ అన్నది మాత్రం త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశముంది.

# ఏపీకి తీర ప్రాంతం..అదే ప్లస్.. అదేమైనస్...

**కాకినాడ, అక్టోబరు 30, పెన్ పవర్:**
సువిశాల తీర ప్రాంతం ఏపీ సొంతం. తిరుపతి జిల్లా తడ నుంచి శ్రీకాకుళం జిల్లా డొంకూరు వరకు తీరం విస్తరించి ఉంది. అయితే ఏపీకి తీరం వరమో.. శాపమో తెలియని పరిస్థితి. ఎందుకంటే తరచూ తుఫానుల బెడద ఉంటుంది బంగాళాఖాతం నుంచి. ఏటా రెండు నుంచి మూడు తుఫాన్లు.. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పెను తుఫాను. తుఫాన్లు వచ్చే క్రమంలో ఏపీ చిగురుటాకుల వణికి పోతుంది. తుఫాన్లతో అంతులేని నష్టం జరుగుతోంది. అయితే దేశంలో ఇతర రాష్ట్రాలకు లేనివిధంగా ఏపీకి మాత్రమే ఈ విపత్తులు ఎందుకు అనేది ఒక ప్రశ్న. అయితే ఏపీ భౌగోళిక స్థితిగతులే ఈ తుఫానులకు తరచూ కారణం. అందుకే ఏపీలో తీర ప్రాంతం పై తుఫాన్లు విరుచుకుపడుతుంటాయి.

**గుజరాత్ తర్వాత పెద్ద తీర రాష్ట్రం..**

గుజరాత్ తరువాత అతి పెద్ద తీర రాష్ట్రం ఏపీ మాత్రమే. సుమారు 974 కిలోమీటర్ల పొడవైన తూర్పు తీరరేఖ మనది. ఇది బంగాళాఖాతం వల్ల ఏర్పడింది. బంగాళాఖాతం ఉష్ణ మండలంలో ఉంటుంది. అందుకే ఇక్కడ ఉండే సముద్రపు నీరు కూడా ఎక్కువ వేడిని కలిగి ఉంటుంది. వేడినీరు తుఫానుల ఉత్పత్తికి ముఖ్యమైన ఇంధనం గా మారుతుంది. అందుకే బంగాళాఖాతంలో తరచూ తుఫానులు వచ్చి ఏపీ ని ఇబ్బంది పెడుతుంటాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సముద్రాల కంటే బంగాళాఖాతంలో తుఫాన్లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఈ సముద్రానికి సంబంధించి ఏపీలో తీర ప్రాంతం అధికంగా ఉంటుంది.

సాధారణంగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు, తుఫాన్లు వాయువ్య దిశగా లేదా వాయువ్య పడమర దిశగా కదులుతూ ఉంటాయి. అందుకే ముందుగా ఏపీని తాకుతుంటాయి. అటు తరువాత ఒడిస్సా తో పాటు పశ్చిమ బెంగాల్ వైపు సంభవిస్తాయి.

ఆంధ్రప్రదేశ్కు ఎక్కువగా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు తుఫాన్ల బెడద ఉంటుంది. ఒక్కోసారి ఇది డిసెంబర్ వరకు కూడా కొనసాగుతుంది.

ఈశాన్యం నుంచి వచ్చే రుతుపవనాల గాలులు, సముద్ర ఉష్ణోగ్రతలు కలిపి తుఫాన్లు ఏర్పడడానికి కారణంగా మారుతున్నాయి. బంగాళాఖాతంలో వాయు పీడనంలో వచ్చే తేడాలు కూడా తుఫానులకు కారణం. ఈ తుఫానులకు ప్రభావితం అయ్యేది ముందుగా ఏపీ.

ఏపీలో ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వారికి ఎక్కువగా తుఫానుల తాకిడి ఉంటుంది. తీరానికి ఈ జిల్లాలు దగ్గరగా ఉండడమే అందుకు కారణం.

# అనంత వైసీపీలో షాక్..

**అనంతపురం, అక్టోబరు 30, పెన్ పవర్:** విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా అభివృద్ధికి అడ్డుపడుతున్నారనే ఆరోపణలపై కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్ కుమార్‌ను ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. ఆరోపణలపై నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీలోని పలువురు నేతలు, ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. ముఖ్య నేతలు మొదలుకుని.. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా కూటమి పార్టీల్లో చేరిన పరిస్థితి. ఇక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గురించి చెప్పాల్సిన పని లేదు. దీంతో చాలా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ అధికారం కోల్పోయింది. తాజాగా అనంతపురం జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్ కుమార్‌ను.. ప్రభుత్వం ఛైర్మన్ పదవి నుంచి తప్పించింది. మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న రాజ్ కుమార్.. 15 నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సెప్టెంబర్ 22న షోకాజ్ నోటీసులు ఇచ్చింది.అయితే ప్రభుత్వం నుంచి షోకాజ్ నోటీసులు అందుకున్న మున్సిపల్ ఛైర్మన్ రాజ్ కుమార్.. నోటీసులపై వివరణ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకపోవడంతో కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధులకు విరుద్ధంగా వ్యవహరించడంతో పాటుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదనే కారణాలతో పదవి నుంచి తొలగిస్తూ ఏపీ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు



జారీ చేసింది. మరోవైపు 2024 నవంబర్ నెల నుంచి 2025 ఏప్రిల్ నెల వరకూ.. రెండు నెలల వ్యవధిలో నిర్వహించాల్సిన కౌన్సిల్ మీటింగులను రాజ్ కుమార్ నిర్వహించలేదని జీవోలో పేర్కొంది.మరోవైపు తలారి రాజ్ కుమార్.. పండ్లు విక్రయించే వ్యాపారి. మున్సిపల్ ఛైర్మన్ కాకముందు తోపుడు బండిపై పండ్లు విక్రయించేవారు. ఇంటర్ వరకూ చదువుకున్నారు. తలారి రాజ్ కుమార్‌కు భార్య విజయలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణలో భాగంగా రాజ్ కుమార్ 2021కి ముందు తోపుడుబండిపై పండ్లు విక్రయించేవారు. అయితే వైసీపీపై అభిమానంతో ఆ పార్టీలో కార్యకర్తగా పనిచేసేవారు. ఈ క్రమంలోనే వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఆయనకు లభించింది. కళ్యాణదుర్గం పదో వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆ తర్వాత ఆయనకు జాక్ పాట్ తగిలింది. ఊహించని విధంగా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవి వరించింది. అయితే ప్రభుత్వం మారటం.. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన తన పదవిని కోల్పోయారు.

# కూలిన బ్రహ్మంగారి ఇల్లు..అరిష్టమా...

**కడప, అక్టోబరు 30, పెన్ పవర్:**
ఏపీలో పలు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మొంథా తుపాను ప్రభావంతో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే వైఎస్ఆర్ జిల్లా కడపలోని బ్రహ్మంగారిమఠంలో కురిసిన వర్షానికి వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం కూలిపోయింది. గత రెండు మూడు రోజులుగా ఇక్కడ వర్షం కురుస్తోంది. దీంతో ఈ నివాసం కూలిపోయింది. అయితే అధికారుల అలసత్వం కారణంగానే ఈ చారిత్రక స్థలానికి ఈ పరిస్థితి వచ్చిందని భక్తులు మండిపడుతున్నారు. వారసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు.మొంథా తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే వైఎస్ఆర్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠంలో భారీ వర్షాలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి నివాస గృహం కుప్పకూలింది. మొంథా తుపాను ప్రభావంతో గత కొన్ని రోజులుగా బ్రహ్మంగారిమఠంలో వర్షం పడుతోంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం కూలిపోయింది. అయితే ఈ ఘటనపై భక్తులు మండిపడుతున్నారు. కాలజ్ఞానకర్తగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసిద్ధి చెందారు. ఎంతో మంది భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిని దర్శించుకోవటానికి వస్తుంటారు. అలాగే నివాస గృహాన్ని సందర్శిస్తూ ఉంటారు.ఇంతటి చారిత్రక ప్రాశిస్త్యం కలిగిన బ్రహ్మంగారి నివాస గృహాన్ని కాపాడాల్సిన అధికారులు.. ఆ విషయంలో అలసత్వం వహించారని భక్తులు మండిపడుతున్నారు.16 శతాబ్దం నాటి వీరబ్రహ్మేంద్ర స్వామి నివాసం పట్ల అధికారులు శ్రద్ధ చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్నప్పుడు మరమ్మతులు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. ఈ విషయంలో బ్రహ్మంగారి వారసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి బ్రహ్మంగారి మఠాన్ని అభివృద్ధి చేస్తున్నామంటున్న అధికారులు.. ఈ ఘటనకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నిస్తున్నారు.మరోవైపు బ్రహ్మంగారిమఠాన్ని సందర్శించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠం అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్తున్నారు. అయితే భక్తులకు మాత్రం కనీస వసతులు కల్పించడం లేదని ఇక్కడికి వచ్చే భక్తుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. తాజాగా వర్షం కారణంగా బ్రహ్మంగారి నివాస గృహం కూలిపోవటంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక కట్టడాన్ని కాపాడడంలో అధికారులు, వారసులు విఫలమయ్యారని భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వీరబ్రహ్మేంద్రస్వామి నివాస గృహం కూలిపోవటంతో కొంతమంది భక్తులు అరిష్టమా అనే భయాందోళనకు

కూడా గురౌతున్నారు.మరోవైపు బ్రహ్మంగారి మఠం నూతన అధిపతి నియామకం కోసం చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే వీరబ్రహ్మేంద్రస్వామివారి శిష్యులు, భక్తులతో పాటుగా పలువురు మఠాధిపతులు, స్వామీజీలతో దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మఠాధిపతిగా తమకు అవకాశం కల్పించాలని వేంకటాద్రి స్వామి, గోవింద స్వామి, భద్రయ్య స్వామి కోరారు. అలాగే తమ అర్హత పత్రాలను అధికారులకు అందించారు. ఆ తర్వాత భక్తులు, శిష్యులు, సమావేశానికి వచ్చిన ఇతర మఠాధిపతులు, స్వామీజీలు తమ అభిప్రాయాలు ఏమిటో రాతపూర్వకంగా అధికారులకు నివేదించారు. ఈ అభిప్రాయాలను పరిశీలించి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

# జగన్ తప్ప అంతా అన్ డ్యూటీ

**విజయవాడ, అక్టోబరు 30 పెన్ పవర్:**
ఎదుటి వారిపై విమర్శలు చేసే ముందు.. మనం ఎలా ఉన్నామో గ్రహించాలి. ఒక వేలితో చూపిస్తే.. పది వేళ్ళు మన వైపే చూపించే రోజులు ఇవి. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది అదే పరిస్థితి. అమ్మ పెట్టదు.. తిననివ్వదు అన్నట్టు ఉంది ఆ పార్టీ దుస్థితి. తుఫాన్ తో ఏపీ అల్లాడిపోతోంది. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. తన వయస్సును లెక్కచేయకుండా ప్రజలను విపత్తు నుంచి కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వానికి అండగా నిలవకపోయినా పర్వాలేదు. కానీ నిందించే ప్రయత్నం మాత్రం చేయకూడదు. చంద్రబాబు ప్రచార యావతో ఇదంతా చేస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోంది. అయితే ఇప్పుడు ఆ ప్రచారమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్ గా మారుతుంది.ఇంత జరుగుతుంటే మీ అధినేత ఎక్కడ అంటే మాత్రం సమాధానం కరువవుతోంది.ప్రస్తుతం ఏపీలో తుఫాను ముప్పు కొంతవరకు దాటినట్లు తెలుస్తోంది. ఒక్క సీఎం చంద్రబాబు కాదు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సైతం అదే పనిలో ఉన్నారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు తమ స్థాయిలో కష్టపడుతున్నారు. సొంత జిల్లాలతో పాటు నియోజకవర్గాల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఎలాంటి ఉపద్రవం ఎదురు ఎదురొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలని కోరుతున్న జగన్మోహన్ రెడ్డి కనిపించకపోవడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. ప్రజల తరపున అసెంబ్లీలో ప్రశ్నిస్తానని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి తనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కావాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రజలు కష్టాల్లో ఉంటే అధికార పార్టీతో సమానంగా సేవలందించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.ప్రస్తుతం బెంగళూరు ప్యాలెస్ లో ఉన్నారు జగన్మోహన్ రెడ్డి. తాడేపల్లి కి వచ్చేందుకు ప్రయత్నించారు. కానీ విమాన సర్వీసులు రద్దయ్యాయి. అందుకే రాలేకపోయారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. రద్దయినవి కేవలం విమాన సర్వీసులు మాత్రమే. ఆయన రావాలంటే రోడ్డు మార్గంలో రావచ్చు కదా? కారులో ఓ 6 గంటలు ప్రయాణిస్తే చేరుకోగలరు కదా? అనే ప్రశ్నలు లాజికల్ గా వినిపిస్తున్నాయి. ఎక్కడైనా బలప్రదర్శనలకు, జన సమీకరణలకు దిగాలంటే ఇట్టే ఆలోచన చేసే జగన్మోహన్ రెడ్డి.. పోలీసులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా%ొా% ఎన్నెన్ని అడ్డంకులు సృష్టించినా దాటి వెళ్ళిపోతారు. కానీ ప్రజలు కష్టాల్లో ఉంటే ఈ తెగువ ఎందుకు ప్రదర్శించడం లేదు అన్నది ప్రశ్న.

# ఒత్తిడిలో జట్టును గెలిపించాను.. నా వన్డే కెరీర్‌లో అదే బెస్ట్ ఇన్నింగ్స్: రాహుల్




**హైదరాబాద్ పెన్ పవర్:** బాగా ఆడినప్పుడు ప్రశంసలు, చెత్త ప్రదర్శనకు విమర్శలు రావడం సహజమే. క్రికెట్ ని విపరీతంగా అభిమానించే మన దేశంలో ఇది మరీ ఎక్కువగా ఉంటుంది. టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మాత్రం దీనికి మినహాయింపేమీ కాదు. అతను బాగా ఆడిన ఇన్నింగ్స్ ఎవరూ గుర్తించకపోగా.. విఫలమైతే మాత్రమే విమర్శిస్తారు. ప్రస్తుతం ఇండియాలో రాహుల్ వన్డే, టెస్టుల్లో రెగ్యులర్ ప్లేయర్. టెస్టుల్లో ఇన్నింగ్స్ ఓపెన్ చేస్తాడు. వన్డేల్లో వికెట్ కీపింగ్ చేస్తూ ఐదో స్థానంలో బ్యాటింగ్ కు దిగుతాడు. రెండు ఫార్మాట్ లలో రాహుల్ భారత జట్టులో కీలక ప్లేయర్ గా మారాడు. ముఖ్యంగా టెస్టుల్లో రాహుల్ అనుభవం టీమిండియాకు బాగా కలిసి వస్తుంది.వన్డే కెరీర్ లో ఎన్నో మరపురాని ఇన్నింగ్స్ లు ఆడిన రాహుల్.. తన బెస్ట్ ఇన్నింగ్స్ గురించి చెప్పుకొచ్చాడు. 2023 వన్డే వరల్డ్ కప్ ఆస్ట్రేలియాపై జరిగిన లీగ్ మ్యాచ్ లో తీవ్రమైన ఒత్తిడిలో 97 పరుగులు చేసి రాహుల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ ను రాహుల్ తన వన్డే బెస్ట్ ఇన్నింగ్స్ గా చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్ లో సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఇండియా గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా కేవలం 199 పరుగులకే ఆలౌటైంది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియాకు ఘోరమైన ఆరంభం లభించింది.


అసలే సాధారణ లక్ష్యం.. భారత్ బ్యాటింగ్ లైనప్ కి ఇది స్వల్ప లక్ష్యం. ఆడేది స్వదేశంలో.. ఇంకేముంది వరల్డ్ కప్ లో మనోళ్లు బోణీ కొట్టినట్టే అనుకున్నారు. కానీ భారత్ బ్యాటింగ్ దిగిన పావుగంటలో అల్లకల్లోమైపోయింది. దిగినవారు పెవిలియన్ కి క్యూ కట్టారు. ఏకంగా ముగ్గురు టాప్ బ్యాటర్లు డకౌట్ అయ్యారు. 2 పరుగులకే కీలకమైన మూడు వికెట్లు కోల్పోవడంతో సొంతగడ్డపై పరాభవం తప్పదేమో అని భయపడ్డారు. ఈ దశలో రాహుల్ 97 పరుగులతో జట్టును గెలిపించాడు. ఇటీవలే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ ముగించుకున్న రాహుల్ ప్రస్తుతం వెస్టిండీస్ తో స్వదేశంలో రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు.

# ఆస్ట్రేలియా వీర ఉతుకుడు.. టీమిండియాను టెన్షన్ పెడుతున్న బిగ్ టార్గెట్

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ లో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న సెమీ ఫైనల్లో ఇండియా బౌలర్స్ ఆకట్టుకోలేకపోయారు. గురువారం (అక్టోబర్ 30) నవీ ముంబై వేదికగా డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో ప్రత్యర్థి ఆస్ట్రేలియాకు భారీ స్కోర్ ఇచ్చారు. టీమిండియా వీక్ బౌలింగ్ ను ఒక ఆటాడుకుంటూ ఆసీస్ ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (93 బంతుల్లో 119: 17 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు సెంచరీ చేయడంతో ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 119 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచింది. పెర్రీ (77), గార్డ్ నర్ (63) హాఫ్ సెంచరీలతో కీలక ఇన్నింగ్స్ ఆడారు. టాస్ గెలిచి ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ కు దిగింది. ప్రమాదకరమైన కెప్టెన్ హీలేను 5 పరుగులకే ఔట్ చేసి క్రాంతి గౌడ్ క్లీన్ బౌల్డ్ చేసి టీమిండియాకు బిగ్ రిలీఫ్ ఇచ్చింది. దీంతో ఆస్ట్రేలియా 25 పరుగుల వద్ద తమ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత పెర్రీతో కలిసిన లిచ్‌ఫీల్డ్ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. వరుసబెట్టి బౌండరీలు బాదుతూ హాఫ్ సెంచరీ.. ఆ తర్వాత 77 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకుంది. వీరిద్దరూ రెండో వికెట్ కు 155 పరుగుల భారీ బాగాస్వాయం నెలకొల్పి జట్టు భారీ స్కోర్ కు బాటలు వేశారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అమన్ జ్యోత్ కౌర్ విడగొట్టింది. సెంచరీ చేసి వేగంగా ఆడుతున్న లిచ్‌ఫీల్డ్ ను బౌల్డ్ చేసి భాగస్వామ్యానికి బ్రేక్ వేసింది. ఆ తర్వాత మూనీతో కలిసి పెర్రీ 40 పరుగుల స్వల్ప భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే ఒక్కసారిగా టీమిండియా బౌలర్లు పుంజుకున్నారు. 45 పరుగుల వ్యవధిలో నాలుగు కీలక వికెట్లు తీసి ఆసీస్ పరుగుల ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. చివర్లో గార్డ్ నర్ చెలరేగి ఆడడంతో ఆసీస్ స్కోర్ ను 330 పరుగులు దాటింది. ఇండియా బౌలర్లలో శ్రీ చరణి, దీప్తి శర్మ తలో రెండు వికెట్లు పడగొట్టారు. క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్,రాధా యాదవ్ లకు ఒక్కో వికెట్ దక్కింది.




# ఐపీఎల్ 2026కు ముందు కొత్త హెడ్ కోచ్‌ను ప్రకటించిన కోల్‌కతా నైట్ రైడర్స్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ కు ముందు కోల్ కతా నైట్ రైడర్స్ జట్టుకు కొత్త ప్రధాన కోచ్ గా అభిషేక్ నాయర్ నియమించింది. ఈ విషయాన్ని కోల్ కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీ గురువారం (అక్టోబర్ 30) అధికారికంగా ప్రకటించింది. ఐపీఎల్ 2025 సీజన్ తర్వాత కేకేఆర్ ఫ్రాంచైజీతో విడిపోయిన చంద్రకాంత్ పండిట్ స్థానంలో నాయర్ హెడ్ కోచ్ బాధ్యతలు సీకరిస్తాడు. నాయర్ కేకేఆర్ ఫ్రాంచైజ్ సెటప్‌లో చాలా కాలంగా సభ్యుడిగా ఉన్నారు. అసిస్టెంట్ కోచ్ గా సేవలను అందించాడు. రింకు సింగ్, హర్షిత్ రాణా వంటి యంగ్ టాలెంటెడ్ ప్లేయర్స్ ను వెలికి తీయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

2024లో కేకేఆర్ టైటిల్ గెలిచినప్పుడు అభిషేక్ నాయర్ కోచింగ్ స్టాఫ్ లో సభ్యుడు. ప్రస్తుతం భారత జట్టుకు అసిస్టెంట్ కోచ్ గా వ్యవహరిస్తున్నాడు. 2024లో చంద్రకాంత్ పండిట్ హయాంలో కేకేఆర్ టైటిల్ విజేతగా నిలిచింది. అయితే ఆ క్రెడిట్ మొత్తం ఫ్రాంచైజీ మెంటర్ గౌతమ్ గంభీర్ కు దక్కింది. 2025లో అజింక్య రహానే కెప్టెన్సీలోని కేకేఆర్ జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం 5 విజయాలతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. పేలవ ప్రదర్శన కారణంగా చంద్రకాంత్ పై విమర్శల వర్షం వచ్చింది. ఐపీఎల్ 2022 ముగిసిన తర్వాత ఇంగ్లాండ్ టెస్ట్ ప్రధాన కోచ్ బ్రెండన్ మెకల్లమ్ స్థానంలో చంద్రకాంత్ పండిట్ నియమితులయ్యారు. తన తొలి సీజన్ (2023) లో జట్టు ఏడో స్థానంలో నిలిచింది. ఈ సీజన్ లో రెగ్యులర్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ గాయం కారణంగా దూరమయ్యాడు. 2024 లో శ్రేయాస్ కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతంగా ఆడి టైటిల్ గెలిచింది. 2025 ఐపీఎల్ సీజన్ లో కేకేఆర్ ప్లే ఆఫ్స్ కు చేరకపోవడంతో ఆయన తన ప్రధాన కోచ్ పదవికి రాజీనామా చేశారు.

## అద్భుతమైన మరియు ఆకర్షణీయమైన పోజులు



# బన్నీ - అట్లీ.. అందరిలో ఒక్కటే డౌట్..

అల్లు అర్జున్ తో తీస్తున్న సినిమాపై డైరెక్టర్ అట్లీ చాలా కేర్ తీసుకుంటున్నారు. ప్రతీ చిన్న విషయంలో జాగ్రత్త వహిస్తున్నారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభం అయ్యాయి. ఒక్కోక్కరిపై సీన్స్ కూడా చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే మెయిన్ ఫీమేల్ లీడ్ దీపికా పదుకొణె క్యారెక్టర్ పై హింట్ ఇచ్చేలా ఓ వీడియో సైతం వదిలారు. సినిమాలో దీపికతో సహా మరో ఇద్దరు హీరోయిన్లను పెట్టారు దర్శకుడు అట్లీ.

హీరోగా బన్నీకి ఉన్న ఫేమ్ సరిపోతుంది. పుష్పతో మార్కెట్ పెరగడంతో బన్నీకి అపోజిట్ క్యారెక్టర్ కూడా పెద్ద స్టార్ ఉండనవసరం లేదు. ఇక ముగ్గురు హీరోయిన్లతో సినిమాను కాస్త కలరింగ్ టచ్ ఇస్తున్నారు. అయితే సినిమాకు వీటి తర్వాత అత్యంత ముఖ్యమైంది మాత్రం సంగీతమే. తమిళ్ లో ఏదైనా పెద్ద సినిమా ఉందంటే మేకర్స్ తొలి చూపు అనిరుధ్ రవిచంద్రన్ వైపే ఉంటుంది. కానీ, ఈ ప్రాజెక్ట్ కు అట్లీ మాత్రం అనిరుధ్ ను కాదని యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపిక సినిమా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

అయితే తాజాగా సాయి మూవీటీమ్ తో చేరడట. ఆయన మ్యూజిక్ పనులు కూడా ప్రారంభం అయ్యాయి. కానీ ఇక్కడ అందరి సందేహం ఒక్కటే. అట్లీ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ ను సాయి హ్యాండిల్ చేయగలడా? బన్ని సినిమా అంటే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మినిమమ్ ఉండాలని ఫ్యాన్స్ ఆశిస్తారు. సినిమాలో ఎక్కడైనా స్టోరీ స్లో అయినా.. బీజీఎమ్ సినిమాను నిలబెడుతుంది. మరి అంతటి హెవీ బాధ్యతలు సాయి ఫుల్ ఫిల్ చేయగలడా అని ఫ్యాన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.కాగా, సాయి అభ్యంకర్ సంగీతం అందించిన తొలి సినిమా డ్యూడ్ రీసెంట్ గా రిలీజైంది. అయితే ఇందులో పాటలు రిలీజైన కొత్తగా మిశ్రమ స్పందనలు వచ్చాయి. కానీ వింటూ ఉంటే ఒక్కొక్కటి మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుంటున్నాయి. అంటే సాయి మ్యూజిక్ స్లో బర్న్ వెర్షన్ పాటలన్న మాట! అయితే బన్నీకి ఇలాంటివి సూట్ అవ్వవు. ఆయనకు పాప్ సాంగ్స్ వర్కౌట్ అవుతాయి.

మరి కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఈ ప్రాజెక్ట్ కు ఫ్రెష్ సంగీతం అందిస్తాడా అనేది ఆసక్తిగా ఉంది. కానీ, అతడి ఔట్ పుట్ అనేది పూర్తిగా అట్లీపైనే డిపెండ్ అయి ఉంటుంది. మ్యూజిక్ డైరెక్టర్ నుంచి ఎలాంటి ఔట్ పుట్ రాబట్టుకోవాలనేది కంప్లీట్ గా డైరెక్టర్ పై డిపెండ్ ఉంటుంది. చూడాలి మరి ఈ యంగ్ టాలెంటెడ్ నుంచి ఎలాంటి మ్యూజిక్ రాబట్టుతారో! అటు సన్ పిక్చర్స్ కూడా ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా రూ.800 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందిస్తుందని టాక్. బడ్జెట్ విషయంలో అట్లీకి ఫుల్ హ్యాండ్ ఇచ్చినట్లు సమాచారం! ఇంతటి అంచనాలు ఉన్న ఈ ప్రాజెక్ట్ ను అట్లీ ఎలా తీర్చి దిద్దుతారో చూడాలి.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com